


ఎంతపని చేశావయ్యా..!



సమీర(ఫైల్)

పాలబుగ్గల చిన్నారి.. బుడి బుడి అడుగులతో.. కాళ్లకు పట్టీలతో తిరుగుతున్న బంగారు తల్లి. ఆ చిట్టితల్లికి అమ్మే దైవం.. నాన్నే సర్వం.. రోజూ అమ్మ ఒళ్లో పడుకోవడం, నాన్నతో ఆడుకోవడమే పని. మరికొన్ని నెలల్లో తోడుగా తోబుట్టువు వస్తుందని అమ్మ చెప్పే మాటలతో ఎంతో ఆనందపడింది. ఎంచక్కా ఇద్దరూ ఆడుకోవచ్చని ఆశపడింది. లోకం తెలియని ఆ చిన్నారి తండ్రే కాలయముడవుతాడని అనుకోలేదు. అమ్మను చంపే సమయంలోనూ వచ్చీరాని మాటలతో 'డాడీ.. వద్దు..డాడీ' అంటూ ఏడ్చేసింది. భయంతో ఓ మూలన అలా ఏడుస్తూ ఉండిపోయింది. అయినా ఆ కర్కశ హృదయం ఏ మాత్రం కరగలేదు. మళ్లీ ఆడబిడ్డ పుడుతుందన్న కోపంతో పాటు భార్యపై అనుమానం పెంచుకొని గర్భిణి అయిన భార్యను అతి కిరాతకంగా హతమార్చాడు. ఆ ఘటన చూసి బిక్కుబిక్కు మంటున్న మూడేళ్ల కుమార్తెను సైతం లాక్కొచ్చి మంచంపై పడేసి గొంతు నులిమి చంపేశాడు. ప్రతి ఒక్కరిని ఆవేదనకు గురి చేసే ఈ అమానవీయ ఘటన హొళగుంద మండలం హెబ్బటం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది.



సలీమా(ఫైల్)

- కుమార్తెను, భార్యను హతమార్చిన భర్త
- భార్య ఆరునెలల గర్భిణి
- మూడేళ్ల కుమార్తెను గొంతు నులిమి చంపిన తండ్రి
- మళ్లీ ఆడబిడ్డ పుడుతుందనే అనుమానంతోనే..
- హొళగుంద మండలం హెబ్బటంలో దారుణం

5

న్యూస్ బాక్స్

'మెగా' మీటింగ్‌పై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని మంచి వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహణ ఏర్పాట్లపై మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలు ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలను, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, డీఈవో శ్యామ్యూల్ పాల్, డీఎస్‌వో రాజా రఘువీర్, డీపీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను పరిష్కరించండి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరి రివిజన్-2025కు సంబంధించి నవంబరు 28 వరకు తీసుకున్న క్లెయిమ్స్ అభ్యంతరాలను డిసెంబరు 24వ తేదీలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఈఆర్‌వోలు, తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి స్పెషల్ సమ్మరి రివిజన్-2025పై ఈఆర్వోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరి రివిజన్-2025కు సంబంధించి ప్రతి క్లెయిమ్ సంబంధిత ఎవిడెన్స్‌లతో ఒక ఫైల్ ఉండాలన్నారు. ప్రతి ఫైల్‌లో అప్లికేషన్, ఇచ్చిన నోటీసు, ఎంక్వైరి స్టేట్‌మెంట్, స్పీకింగ్ ఆర్డర్, తగిన ఆధారాలు ఉండాలన్నారు. బల్క్ అప్లికేషన్లు వచ్చినప్పుడు త్రీమెన్ కమిటీ వెరిఫై చేయాలన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం కర్నూలు కలెక్టరేట్‌లో రెవెన్యూ సదస్సులపై కలెక్టర్ సమీక్ష జరిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆన్‌లైన్ అప్‌డేషన్, మ్యుటేషన్, విస్తీర్ణం సమస్యలు, పాస్ పుస్తకాలు తదితర భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు 70 నుంచి 80 శాతం వరకు వస్తుంటాయన్నారు. ఇలాంటి భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను చేస్తోందన్నారు. రెవెన్యూ సదస్సులకు తహసీల్దార్, వక్ఫ్, దేవాదాయ, రిజిస్ట్రేషన్ అధికారి, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు ఒక టీమ్‌గా వెళ్లి చేసినట్లు తెలిపారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఇదివరకే గ్రామసభలను నిర్వహించినట్లు తెలిపారు. 18వేల వరకు దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 10వేల వరకు సర్వేకు సంబంధించిన దరఖాస్తులు కాగా, 8వేలు రెవెన్యూకి సంబంధించిన సమస్యల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 3వేల దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లాలో 34 సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ బి. నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీఈవో శ్యామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు వేగవంతం చేయండి

జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కందుల కొనుగోళ్లను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మార్క్‌ఫెడ్ అధికారులతో కందుల కొనుగోళ్లపై జేసీ సమావేశాన్ని నిర్వహించారు. మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు జిల్లాలో 53వేల మెట్రిక్ టన్నుల కందులను రైతుల నుంచి కొనుగోలు చేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వెంటనే తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో తమ వివరాలను నమోదు చేయాలన్నారు. దళారి వ్యవస్థను నమ్మి రైతులు మోసపోకుండా మార్క్‌ఫెడ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు గోనెసంచులు, కొనుగోలు కేంద్రం నుంచి గోదాములకు చేర్చేవరకు రవాణా చార్జీలు మార్క్‌ఫెడ్ అధికారులే సమకూర్చాలని జేసీ స్పష్టం చేశారు.

8 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి

కర్నూలు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 8 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో ఇస్వి పోలీస్ స్టేషన్‌కు చెందిన కె. నీలకంఠ, నంద్యాల తాలుకా యుపీఎస్‌కు చెందిన కే.నాగేంద్ర, మహానంది పోలీస్‌స్టేషన్‌కు చెందిన కే. రవీంద్రుడు, ఉయ్యాలవాడ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సి. శ్రీనివాసులు, దొర్నిపాడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ జి.సుధాకర్ రెడ్డి, మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ కే. శ్రీనివాసులు, కర్నూలు తాలుకా యూపీఎస్ కానిస్టేబుల్ ఎస్.మహ్మద్ ఆలీ, నంద్యాల త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ డి.సంజీవరాయుడు ఉన్నారు.

రీ సర్వే అక్రమాలపై చెక్?



గత వైసీపీ పాలనలో అంతులేని భూ దురాక్రమణలు జరిగాయి. ఆ పార్టీ నేతలు, గల్లీ నాయకులు ఎక్కడబడితే అక్కడ భూములు కబ్జా చేశారు. చివరికి 22ఏ పరిధిలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ యంత్రాంగం సహకారంతో డీనోటిఫై చేసి అసైన్డ్ భూములుగా మార్చి వాటిని తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ అక్రమాలన్నీ గుర్తించింది. రీసర్వే పేరుతో జరిగిన అక్రమాలను చక్కదిద్ది, వీటికి పాల్పడిన నాయకులపై, సహకరించిన రెవెన్యూ యంత్రాంగంపైన క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగానే ఈ నెల 6వ తేదీ జనవరి 8వ తేదీ వరకు అధికారులు గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు.

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని గ్రామాల్లో పెద్ద ఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారు. దశాబ్దాల కింద ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న చిన్న, సన్నకారు రైతులను భయపెట్టి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరి భూదాహం ఇంతటితో ఆగలేదు. 22ఏ సెక్షన్ కింద ఉన్న ప్రభుత్వ భూములను ఫ్రీహోల్డ్‌గా మార్చి తమ మాట వినే అమాయక రైతుల పేరు మీద అసైన్డ్ భూములుగా మార్చి, ఆ తర్వాత వాటిని తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో మూడు విడతల్లో కలిపి 593 గ్రామాల్లో రీసర్వే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అయితే.. పూర్తి స్థాయిలో కర్నూలు జిల్లాలో 141, నంద్యాల జిల్లాలో 148 గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తయింది. ఈ సందర్భంగా రెవెన్యూ యంత్రాంగాన్ని లోబర్చుకుని ఆనాటి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేతలు, వారి అనుచరులు పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను తమ పేర్లతో రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాలో దాదాపు 20వేల ఎకరాలకు పైగానే అసైన్డ్ భూములను తమ పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రైతులను బెదిరించి తక్కువ మొత్తాన్ని వారికి ముట్టజెప్పి విలువైన అసైన్డ్ పొలాలను ఆ నాయకులు దక్కించుకున్నారు. ఇంతటితో వారి భూదాహానికి తెరపడలేదు. ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని తమ బినామీలకు కట్టబెట్టి ఆ భూములను కూడా సొంతం చేసుకున్న దారుణాలు ఎన్నెన్నో వెలుగు చూశాయి. ఈ అన్యాయాలపై దరఖాస్తులు పెద్ద ఎత్తున రావడంతో ప్రాథమిక విచారణ చేయించారు. తమ దారుణాలు ఎక్కడ బయటకు వస్తాయోనని చిత్తూరు జిల్లా మదనపల్లిలో 22ఏ ఫైళ్లను వైసీపీ నేతలు తగులబెట్టడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. రీ సర్వే వల్ల రైతులకు జరిగిన అన్యాయాలను సరిదిద్దేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుల్లో రైతులు ఇచ్చే దరఖాస్తుల వల్ల తమ భాగోతాలు ఎక్కడ బయట పడుతాయోనని నాయకులు కంటి మీద కునుకు లేకుండా ఉన్నారు. అలాగే రెవెన్యూ అధికారులు, వారి సిబ్బంది కూడా తమపై క్రిమినల్ కేసులు ఎక్కడ నమోదవుతాయోనని ఆందోళన చెందుతున్నారు

- భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్న రైతులు
- అక్రమాలకు అండగా ఉన్న రెవెన్యూ యంత్రాంగంపై కేసులు నమోదవుతాయా..?
- 22ఏ, ఫ్రీహోల్డ్ భూఆక్రమణలపై ఫిర్యాదుల స్వీకరణ
- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మిగతా 4లో..

ముచ్చటగా మూడోసారి..!

- సాగుతున్న సాగునీటి సంఘాల ఎన్నికలు
- 11న నోటిఫికేషన్ వచ్చే అవకాశం
- ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం



జలమండలి ఆఫీసులో ఎన్నికల సామగ్రి సరి చేస్తున్న ఎంఐ ఏఈఈ రియాజ్, సిబ్బంది

కర్నూలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండుసార్లు వాయిదా పడ్డ సాగునీటి సంఘాల ఎన్నికలకు మరో ముహూర్తం దాదాపు ఖరారైంది. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ షెడ్యూలు ప్రకారమైతే గురువారం (5వ తేదీ) ప్రారంభం కావాల్సి ఉండేది. ఫెంగల్ తుఫాన్ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ నెల 14న నుంచి ఎన్నికల నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం అమరావతిలో వెల్లడించారు. అయితే అధికారిక సమాచారం రాలేదని, ఎప్పుడు నోటిఫికేషన్ జారీ చేసినా ఎన్నికలు జరిపేందుకు ఇంజనీర్లు సిద్ధంగా ఉన్నారు. ఈ నెల 11న జిల్లా కలెక్టరు నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. 18న కర్నూలు జిల్లాలో 123 సాగునీటి సంఘాల పరిధిలో 1,214 ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ) సభ్యులు, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలకు 2,480 టీసీ సభ్యులను రైతులు ఎన్నుకుంటారు. అదే రోజు టీసీ సభ్యులు సమావేశమై సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 20న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఇంజినీర్లు పేర్కొంటున్నారు. అయితే అధికారికంగా సమాచారం వెల్లడి కావాల్సి ఉంది. రాష్ట్ర విభజన తర్వాత 2015లో ఆనాటి టీడీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2020లో నీటి సంఘాలను రద్దు చేసింది. మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో తొమ్మిదేళ్ల తరువాత ఈ ఎన్నికల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అక్టోబరు 21న జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయగా అసెంబ్లీ సమావేశాలు కారణంగా వాయిదా వేశారు. ఈ నెల 5 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంటే.. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వాయిదా పడ్డాయి. ఎట్టకేలకు మూడోసారి ముహూర్తం నిర్ణయించారు. కర్నూలు జిల్లాలో 123 సాగునీటి సంఘాలు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 2 ప్రాజెక్టు కమిటీలు, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలు, 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 4 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

జీడీపీకి ఎల్లెల్సీ నీరు

- రోజుకు 170 క్యూసెక్కుల నీరు చేరిక
- హంద్రీనీవా నుంచి రోజుకు 40 క్యూసెక్కుల నీరు

గోనెగండ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టుకు తుంగభద్ర దిగువ కాలువ నీటిని గురువారం ఇరిగేషన్ అధికారులు గోనెగండ్ల ఎస్కేప్ ఛానల్ ద్వారా మళ్లించారు. గోనెగండ్ల ఎల్లెల్సీ సెక్షన్‌కు ఎగువ ప్రాంతం నుంచి 220 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అందులో 170 క్యూసెక్కుల నీరు గాజులదిన్నె ప్రాజెక్టుకు విడుదల చేసి మిగిలిన 50 క్యూసెక్కుల నీరు కోడుమూరు ప్రాంతానికి మళ్లిస్తున్నారు. అలాగే హంద్రీ నీవా నుంచి రోజుకు 40 క్యూసెక్కులు జీడీపీకి చేరుతున్నాయి. ప్రాజెక్టులో ప్రస్తుతం 2.2 టీఎంసీ నీరు ఉంది. గత రెండు రోజుల క్రితం రబీ సీజన్ కింద గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు సాగుకు అధికారులు, నాయకులు నీరు విడుదల చేశారు. అలాగే జీడీపీ కింద బండగట్టు, డోన్, కిష్టగిరి, కోడుమూరు, కర్నూలు, గూడురు, బెళగల్, లద్దగిరి తదితర ప్రాంతాలకు తాగునీటి పథకాల ద్వారా నీరు అందించాల్సి ఉంది. దాదాపు 14వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వడంతో పాటు తాగునీటి పథకాలకు కూడా వచ్చే ఏడాది జూన్ వరకు నీరు అందించాల్సి ఉంటుంది. ఈ దృష్ట్యా ప్రస్తుతం ఎల్లెల్సీ నీరు, హంద్రీనీవా నీటిని ప్రాజెక్టులో నిలువ చేస్తున్నారు.



గోనెగండ్ల ఎల్లెల్సీ ఎస్కేప్ చానల్ నుంచి గాజులదిన్నె ప్రాజెక్టు నీరు వదిలి దృశ్యం

అద్దె అడిగితే చంపేస్తామంటున్నారు..

- న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం
- పోలీసులు కూడా పట్టించుకోలేదు
- నంద్యాలలో ఓ కుటుంబం సెల్ఫీ వీడియో కలకలం

5

ప్రజా సమస్యలను పరిష్కరించండి

- అధికారులను ఆదేశించిన మంత్రి బీసీ

4

ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయాలి

- మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్

4

శ్రీశైలం ఈవోగా ఎం.శ్రీనివాసరావు

రోజూ 5 ఇళ్లను సందర్శించండి

- డీఎంహెచ్‌వో భాస్కర్



జోహరాపురం అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ 3.0 సర్వేలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఒక టీంగా వెళ్లి వారంలో ఐదు రోజులు.. రోజుకు 5 ఇండ్లను సందర్శించాలని డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ వెల్లడించారు. గురువారం ఆయన జొహరాపురం-2 అర్బన్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. వ్యాక్సిన్ నిల్వలను, శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. ఆరోగ్య సేవల కొరకు వచ్చిన వారు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అబా) ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఆ తర్వాత పరీక్షలు చేసి చికిత్స అందించాలన్నారు. డీఎంహెచ్‌వో వెంట జిల్లా మలేరియా అధికారి ఏ.నూకరాజు ఉన్నారు.

ప్రశాంతంగా రైల్వే యూనియన్ పోలింగ్

కర్నూలు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికలు గురువారం నాటికి ముగిశాయి. ఈనెల 4,5వతేదీల్లో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. కర్నూలుసిటి రైల్వేస్టేషన్ పరిధిలో తొలిరోజు 223మంది రైల్వే ఉద్యోగులు, కార్మికులు ఓటు వేయగా రెండో రోజు 174 మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రెండవరోజు పోలింగ్ ప్రక్రియ ముగిసేసరికి 397మంది ఓట్లు పోలైనట్లు వివరించారు. కర్నూలు, ఉలిందకొండ, దూపాడు, వెల్దుర్తి, మానవపాడు రైల్వేస్టేషన్ పరిధిలో మొత్తం 452 ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. అందులో ఓటు వేయని 55మంది ఉద్యోగ కార్మికులు నేడు రన్నింగ్ ఉద్యోగులతో పాటు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు.

సాహిత్యం

అలుపెరుగని అక్షర యోధురాలు

- తొమ్మిది పదుల వయస్సులోనూ సాగుతున్న సాహితీ ప్రస్థానం
- ఇప్పటి వరకు 35 పుస్తకాలు వెలువరించిన ఆరేపల్లి వరలక్ష్మమ్మ



కర్నూలు కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆమె తండ్రి, పెద్ద తండ్రులు స్వాతంత్ర్య సమరయోధులు...దేశభక్తి వారు పట్టిన ఉగ్గుపాలతో ఒంటి నిండా చేరిపోయింది. భర్త నుంచి వంటబట్టిన భాగవతాది పురాణాలు, పౌరాణిక విషయజ్ఞానం మనస్సు నిండా ఉండిపోయాయి. బాగా చదువుకోవాలన్న ఆశను ఆనాటి కుటుంబ వ్యవస్థ అకుంఠ దశలోనే తుంచేసింది. పైగా 'ఆడవాళ్లు చదువుకొని ఉద్యోగాలు చేసేది ఉందా.. రాజ్యాలు ఏలేది ఉందా..?' అన్న ఒక్కమాటతో 8వ తరగతి వరకే చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది. తర్వాత పెళ్లి, ఆ తర్వాత పిల్లలు, వారిని పెంచడం, బాగా చదివించి ప్రయోజకులను చేయడంతో ఆమె సగం జీవితం గడిచిపోయింది. ఆమె వెనక్కి తిరిగి చూసుకునే సరికి సగ జీవిత కాలం గడిచిపోయింది. అయినా ఆమెలో ఏదో పట్టుదల. ఏదో సాధించాలన్న తాపత్రయం. అన్నింటికీ మించి తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక గుర్తింపు రావాలన్న కాంక్ష. తన రచనల ద్వారా సమాజానికి ఏదైనా మంచి చేద్దామన్న కోరిక. ఇదే ఆమెను 88 ఏళ్ల వయస్సులో తెలుగు ఛందస్సు పాఠాలు నేర్చుకునేలా చేసింది. ఆపైన ఆమె తిరిగి వెనక్కి చూసుకోకుండా అక్షర ప్రస్థానం ప్రారంభించారు. ఇప్పటి వరకు 35 పుస్తకాలు వెలువరించారు. 90 ఏళ్ల వయస్సులో అలుపెరుగని అక్షర యోధురాలిగా అనునిత్యం రచన చేస్తూనే ఉన్నారు. ఆమెనే కర్నూలుకు చెందిన ఆరేపల్లి వరలక్ష్మమ్మ. తెలుగు భాష, తెలుగు పద్యం సామాన్య ప్రజలకు దూరమై పోతున్న తరుణంలో ఆమె తన పుస్తకాల ద్వారా మాతృభాషా విశిష్టతను తెలియజేస్తూ భావితరానికి తన పుస్తకాలతో మార్గదర్శనం చేస్తున్నారు.



మలిదశలో పుస్తక రచనలపై ఆసక్తి...

విశ్రాంత జీవితంలో, మలిజీవిత మజిలీ సాగిస్తున్న ఆరేపల్లి వరలక్ష్మమ్మకు 83 ఏళ్ల వయస్సులో హైదరాబాదులో ప్రజ్ఞా భారతి సంస్థ నిర్వహిస్తున్న ఒక సమావేశానికి వెళ్లింది. అక్కడ భమిడిపాటి సుబ్రహ్మణ్యంశర్మ రాసిన 'పల్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ పుస్తకం ప్రముఖుల కొటేషన్లతో కూడిన వ్యాఖ్యలతో ఉన్నదే. అయితే తాను ఎందుకు అలాంటి ప్రయత్నం చేయకూడదనే ఆలోచనతో 83వ ఏట 'ఆణిముత్యాలు' పేరుతో వేమన, బద్దెన, భర్తృహరి పద్యాలు, సుభాషితాలకు అచ్చ తెలుగులో అర్థాలు వివరిస్తూ పుస్తకాన్ని వెలువరించారు. దీనికి అనూహ్య స్పందన లభించింది. తర్వాత మరో రెండు పద్య పుస్తకాలు రాసి భాషా పండితులకు చూపించారు. ఆ పద్యాల్లో ఛందస్సు లేదని, ముందు ఛందస్సు నేర్చుకుంటే మంచి పద్యాలు రాసేందుకు అవకాశం ఉంటుందని వారు సూచించారు. దీంతో ఆమె ఒక తెలుగు మాస్టారు వద్దకు 84 ఏళ్ల వయస్సులో బడికి వెళ్లే ఒకటో తరగతి పిల్లల్లా పుస్తకాల సంచి భుజాన వేసుకొని వెళ్లి ఛందస్సు నేర్చుకున్నారు. అంతే ఆ తర్వాత ఆమె తిరిగి వెనక్కి చూసుకోలేదు.

బాల్యం.. జీవిత నేపథ్యం

జిల్లాలోని కోడుమూరు మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన చిన్నలక్ష్మారెడ్డి, కామాక్షమ్మ దంపతులకు 1935 ఏప్రిల్ 25న వరలక్ష్మమ్మ జన్మించారు. ముగ్గురు అన్నదమ్ముల ఉమ్మడి కుటుంబంలో పెద్దతండ్రి పెద్ద లక్ష్మారెడ్డి నాటి స్వాతంత్ర్య పోరాటంలో అరెస్టు అయ్యారు. ఆయన జైలుకు పోగా ఇద్దరు అన్నదమ్ములు చిన్న లక్ష్మారెడ్డి, చిన్న రామిరెడ్డి వ్యవసాయం, ఇంటి పనులు చూసుకుంటూ అన్నకు కొరియర్స్‌గా స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములుగా ఉండేవారు. ముగ్గురు అన్నదమ్ములు వినోబాభావే ఇచ్చిన పిలుపు మేరకు భూదాన యజ్ఞానికి తమ పది ఎకరాల భూమిని కూడా ఇచ్చేశారు. అలా తండ్రి, పెద్ద తండ్రి నుంచి ఆమె తన బాల్యంలోనే దేశభక్తి స్ఫూర్తిని పొందారు. స్వాతంత్ర్యానంతరం మేనత్త కుమారుడు ఆరేపల్లి అనంతారెడ్డితో 1948 ఫిబ్రవరి 27న తన 13 మూడేళ్ల వయస్సులోనే పెద్దలు వివాహం చేశారు. అప్పటికే వరలక్ష్మమ్మ తమ స్వగ్రామంలో ఆరు వరకు, కర్నూలు న్యాయస్థానంలో పీపీగా విధులు నిర్వహిస్తున్న పెద్దనాన్న వద్ద 8వతరగతి వరకు చదువుకున్నారు. భర్త నుంచి రామాయణ, మహాభారత, భాగవతాది గ్రంథాల సారాంశాన్ని ఆమె నేర్చుకున్నారు. బాగా చదువుకోవాలన్న తపనను తన పిల్లల ద్వారా తీర్చుకున్నారు. ముగ్గురు ఆడపిల్లల్లో ఒకరిని వైద్యురాలిగా, మరొకరిని న్యాయవాదిగా, ఇంకొకరిని ఇంజనీర్‌గా చదివించి వివాహాలు జరిపించారు. ఒక అబ్బాయిని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చదివించి వివాహం జరిపించారు. తన జీవితాన్ని నడిపించిన మార్గదర్శకుడు, తన భర్త 2007 ఫిబ్రవరి 26న ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన లేని బాధ నుంచి బయట పడేందుకు తిరిగి భారత, భాగవతాది పుస్తకాలు ఆశ్రయించారు. అందులోని పద్యాలకు పూర్తిగా అర్థాలు తెలుసుకున్నారు. ఈ విషయ పరిజ్ఞానం సామాన్య ప్రజలకు చేరువ చేయాలనే ఆసక్తి ఆమెలో పెరిగింది.

ధార్మిక భావనలు వెల్లివిరిసేలా రచనలు...

ప్రస్తుత తరానికి ఉపయుక్తంగా నిలిచేలా, ధార్మిక భావనలు వెల్లివిరిసేలా ఆమె అనేక పుస్తకాలు రాసి వెలువరించారు. ఛందస్సు నేర్చుకున్నాక రెండో రచనగా శ్రీ హనుమద్విలాసామృతం రాశారు. ఇది పండితుల చేత కూడా ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత కుమార విజయం, సౌందర్య లహరి, సమర్థసాయి లలితా కథావరి, రమణీయ కల్యాణాలు, పుష్కర తిలకం, నీతిపథంలతోపాటు భారత, భాగవత గ్రంథాల్లోని అనేక ఉప కథలను సంకలనాలుగా తీసుకువచ్చారు. ఇప్పటి వరకు 35 పుస్తకాలు వెలువరించారు.

శక్తి ఉన్నంత కాలం రాస్తూనే ఉంటా...





భగవంతుడు నాకు కళ్లు, ఆలోచనా శక్తి ఇచ్చింతకాలం రాస్తూనే ఉంటాను. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో పెద్దలు పిల్లలకు రామాయణ, మహాభారత, భాగవతాది కథలను చెప్పి వారిలో వివేచన కలిగించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. పిల్లలకు కథలు చెప్పే సమయం తల్లిదండ్రులకు లేదు. అందుకే మంచి నీతివంత కథలు, తెలుగు భాషను సుసంపన్నం చేసే పద్యాలతో భావి తరానికి ఉపయోగపడేలా రచనలు చేస్తున్నాను. ఒకనాడు వ్యవసాయం చేయడంలో సంతోషం ఉండేది. తర్వాత పెళ్లి, సంసారం, పిల్లల చదువు వంటి వాటిలో సంతోషంగా గడిపాను. ఇప్పుడు ఈ రచనల ద్వారా సంతోషంగా నా మలి జీవితం సాగిపోతోంది. ఇంతకన్నా నాకు కావాల్సింది ఏమీ లేదు. - ఆరేపల్లి వరలక్ష్మమ్మ

రీ సర్వే అక్రమాలపై చెక్?



(3వ పేజీ తరువాయి)

తహసీల్దార్ల కార్యాలయాల వద్ద రైతుల పడిగాపులు

గత వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో దశాబ్దాల కాలంగా రైతులు అనుభవిస్తున్న పొలాల హద్దులను సరి చేస్తామని గొప్పలు చెప్పి.. చివరకు వారిని నానా తిప్పలు పెట్టింది. కర్నూలు జిల్లాలో 141, నంద్యాల జిల్లాలో 148 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. అయితే ఈ సర్వే తప్పుల తడకగా మారడంతో అన్నదాతలు తమ బంధువులు, చుట్టుపక్కల నివసించే రైతులతో రోజు ఘర్షణ పడాల్సిన పరిస్థితి నెలకొంది. మొదటి విడతలో 35వేలు, రెండో విడతలో 16,050, మూడు విడతల్లో 160 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నా ఇంకా అనేక గ్రామాల రైతులకు హక్కు పత్రాలు అందలేదు. చాలా మంది రైతులు రీసర్వే కారణంగా తమ పొలాలు తమకు కాకుండా పోయాయని ఆందోళన చెందుతున్నారు. ఈ తప్పులను సరిదిద్దాలని రెవెన్యూ కార్యాలయాల వద్ద రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు.

22ఏ ఆక్రమణలు వెలుగు చూసేనా..?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 914 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 22ఏ పరిధిలో దాదాపు లక్ష ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ప్రభుత్వంలో కీలక నాయకులు, వారి అనుచరులు ఈ భూములను ఫ్రీహోల్డ్ చేయించి అసైన్డ్ భూములుగా మార్చేసి ఆ భూములను బినామీల పేరుతో రెవెన్యూ అధికారుల చేత పత్రాలను సృష్టించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే వీరంతా ఆ భూములను తమ బంధువులు, స్నేహితుల పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఇట్లా ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 20వేల ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు నాటి వైసీపీ పెద్దలు, వారి అనుచరుల పరమైపోయాయి.

అక్రమాలు బయటపడేనా..?

రీసర్వేలో తప్పుడు వివరాల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న నరకయాతనతో పాటు 22ఏ పరిధిలోని భూములను ఏ విధంగా తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారో నిగ్గు తేల్చేందుకు రెవెన్యూ సదస్సులు కీలకం కానున్నాయి. రెవెన్యూ అధికారులు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకునేలా వారికి స్వేచ్ఛ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దీంతో రైతులు ఈ రెవెన్యూ సదస్సులు తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్నారు.

ఒత్తిళ్లకు గురికాకుండా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి

నేటి నుంచి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను అధికారులు ఎవరి ఒత్తిళ్లకు గురి కాకుండా నిర్వహిస్తేనే రైతులకు న్యాయం జరుగుతుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు నరకయాతన అనుభవించారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు అక్రమదారుల పరమైపోయాయి. భూకబ్జాదారుల భరతం పట్టేందుకు రెవెన్యూ సదస్సులే కీలకం కానున్నాయి.
- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్టీఆర్ వైద్య మిత్ర ఎంప్లాయీస్ యూనియన్ ఏర్పాటు



ఎన్టీఆర్ వైద్య మిత్ర కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని నగరంలోని కర్నూలు జీజీహెచ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సి. కంబగిరి, గౌరవ ముఖ్య సలహాదారులుగా డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీప్రసన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ గౌస్, ప్రధాన కార్యదర్శిగా దేవేంద్ర నాయక్, జిల్లా సెక్రటరీగా జి.రాజశేఖర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా రేణుక ఎన్నికయ్యారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

అధికారులను ఆదేశించిన మంత్రి బీసీ



స్వీకరిస్తున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ

బనగానపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి టీడీపీ కార్యాలయంలో మంత్రి స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు అధికంగా వస్తున్నాయని రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దన్నారు. ప్రజలను వేధించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి అక్కడికక్కడే పరిష్కరించారు.

శ్రీశైలం ఈవోగా ఎం.శ్రీనివాసరావు




బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం. శ్రీనివాసరావు

శ్రీశైలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కలెక్టర్ ఎం. శ్రీనివాసరావు గురువారం కార్యాలయ పరిపాలనా భవనంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వామి, అమ్మవార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా సేవలందించే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం క్షేత్రాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో ఉందన్నారు. . దేవస్థానం సిబ్బంది సహాయ సహకారాలతో క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా భక్తులకు వసతి, సౌకర్యవంతమైన దర్శనం, అన్నప్రసాద వితరణ తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాల తయారీ, వంట పదార్థాలు, కూరగాయల నిల్వ, శుభ్రత తదితర వాటిపై అధికారులకు సూచనలు చేశారు.

యురేనియం తవ్వకాలను ఆపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



డోన్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం మామిళ్లపల్లి, రాంపురం, జక్కసానిగుంట్ల గ్రామాల్లో యురేనియం తవ్వకాలు నిలిపివేస్తూ సీఎం చంద్రబాబు ప్రకటన చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాలకు సిద్ధం కావడం దుర్మార్గమైన చర్య అన్నారు. గ్రామాలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని సీఎం చంద్రబాబు నాయుడు కేంద్రంతో మాట్లాడి యురేనియం తవ్వకాల ప్రయత్నాలను నిలిపివేయాలని కోరారు.

ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయాలి

మాజీ మంత్రి సాకే శైలజానాథ్




మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయాలని, బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించాలని మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం బాధ్యతా రాహిత్యంగా పనిచేస్తోందని, ప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడిన వారిని కక్షసాధింపు చర్యలతో వేధిస్తోందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వం చట్టానికి కట్టుబడి పనిచేయడం లేదని అన్నారు. సంభాల్‌లో రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ మధ్యకాలంలో ఈవీఎంలపైన అనుమానాలు ఉన్నాయని చెబితే ఈ అంశాన్ని ఎలక్షన్ కమిషన్ దాటవేస్తోందని అన్నారు. హర్యాణాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తుందని అందరూ ఊహించారని, కానీ అక్కడి ఫలితాలు అనుమానాలకు తావిస్తున్నాయని చెప్పారు. మహారాష్ట్రంలో బీజేపీ అభ్యర్థులు గెలిచిన చోట ఐదు గంటల తర్వాత పోలింగ్‌లో 7, 8 శాతం ఓట్లు అదనంగా ఫామ్ 17సిలో రికార్డు అయ్యాయని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కే బాబురావు, కాంగ్రెస్ నాయకులు కే వెంకటరెడ్డి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు బి. బతుకన్న, ఎస్ ప్రమీల, అనంతరత్నం, సయ్యద్ నవీద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అసెంబ్లీకి ఎందుకు వెళ్లడం లేదు?

- ప్రజలు తిరస్కరించినా సిగ్గు రాలేదా..?
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడటానికి వైసీపీ నాయకుడు జగన్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ప్రశ్నించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా వైసీపీ నాయకులకు సిగ్గు రాలేదని అన్నారు. అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేక కూటమి ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించకుండా, రైతుల మోటర్లకు మీటర్లు బిగిస్తానంటూ నిలువునా కష్టాల్లోకి నెట్టిన వైఎస్ జగన్‌కు ఈ రోజు ప్రజా సమస్యలు గుర్తుకు వచ్చాయా? అని ప్రశ్నించారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించక ఎందరో విద్యార్థులు ఉద్యోగాలు కోల్పోయారని అన్నారు. తమ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టి దివాలా తీయిస్తే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గాడిలో పెడుతున్నారని. దీన్ని చూసి ఓర్చుకోలేక ఆందోళనలకు దిగడం ఎంత వరకు సమంజసమన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో భవిష్యత్తు : జీసీడీవో స్నేహలత

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్ మెంట్ ఆఫీసర్ (జీసీడీవో) స్నేహలత పేర్కొన్నారు. గురువారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులను జీసీడీవోతో పాటు జిల్లా కో ఆర్డినేటర్లు విక్రమ్, ప్రతాప్ పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీఎస్ హుశేన్‌తో మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. వృత్తి విద్యా అధ్యాపకులు మధుసూదన్, కృష్ణకుమారి తదితరులు ఉన్నారు.

నేలసారం పోకుండా చర్యలు తీసుకోవాలి



యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రంలో నేల దినోత్సవంలో మాట్లాడుతున్న కెవికె శాస్త్రవేత్త

బనగానపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేలసారం పోకుండా చర్యలు తీసుకోవాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ధనలక్ష్మి రైతులకు సూచించారు. గురువారం బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో నేలల దినోత్సవాన్ని రైతుల సమక్షంలో నిర్వహించారు. ధనలక్ష్మి మాట్లాడుతూ నేలల సంరక్షణకై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్యవేక్షణ, పరిరక్షణపై రైతులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రపంచంలో 30 శాతం నేలలు సారం కోల్పోయాయన్నారు. రసాయనిక ఎరువులకు స్వస్తి చెప్పి, పరిమితి మేరకు ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. 2-3 సీఎం నేల ఆరోగ్యంగా తయారవడానికి 1000 సంవత్సరాలు పడుతుందన్నారు. నేల విలువ తెలుసుకొని భావిభారత పౌరులకు ఆరోగ్యవంతమైన నేల అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తపరీక్షలు చేయాలి

రుద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల మలేరియా నివారణ రీజనల్ డైరెక్టరు త్యాగరాజు రుద్రవరం మండలం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తదితరులు పాల్గొన్నారు.

8న అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక 8 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో ఉంటుందని అసోసియేషన్ కార్యదర్శి కే. దేవేంద్రగౌడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్ఏ స్టేడియంలో ఉదయం 10 గంటలకు అసోసియేషన్ సిమేషన్ నెట్స్‌లో జరిగే ఎంపికలో ఆసక్తి ఉన్న క్రీడాకారులు పాల్గొనాలని ఆయన సూచించారు. 1.9.2012 తరువాత 31.8.2014కు ముందు జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 9959251047లో సంప్రదించాలన్నారు.

జనవరి 1 నుంచి నాటకోత్సవాలు



మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జనవరి 1 నుంచి 3 వరకు రాష్ట్రస్థాయి సాంఘిక నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. గురువారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన నాటకోత్సవాల వివరాలు వెల్లడించారు. హైదరాబాదులోని మహతి క్రియేషన్స్ సంస్థ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో, సీనియర్ సినీ, టీవీ నటుడు సుబ్బరాయశర్మ సారథ్యంలో ఈ నాటకోత్సవాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జనవరి 1న హైదరాబాదులోని గువ్వాడ క్రియేషన్స్ సంస్థ వారి 'మూల్యం', గుంటూరు జిల్లా కొలకలూరు సాయి ఆర్ట్స్ సంస్థ వారి 'జనరల్ బోగీలు' నాటికల ప్రదర్శన ఉంటాయని తెలిపారు. జనవరి 2న మొదటి నాటికగా గుంటూరులోని అమరావతి ఆర్ట్స్ సంస్థ వారి 'చిగురు మేఘం', రెండో నాటికగా హైదరాబాదులోని డీఆర్కే ఫైన్ ఆర్ట్స్ సంస్థ వారు 'ఈ మంచం నాది కాదు' నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు. జనవరి 3న హైదరాబాదు మహతి క్రియేషన్స్ సంస్థ వారి 'ఉక్కు సంకెళ్లు' నాటిక సీనియర్ నటుడు సుబ్బరాయ శర్మ దర్శకత్వంలో ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రతిరోజూ ప్రముఖ కళాకారులకు సత్కారం ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, సభ్యులు సంగా అంజనేయులు, గాండ్ల లక్ష్మణ్ణ పాల్గొన్నారు.

ఎంత పని చేశావయ్యా...

- కుమార్తెను, భార్యను హతమార్చిన భర్త
- భార్య ఆరునెలల గర్భిణి
- మూడేళ్ల కుమార్తెను గొంతు నులిమి చంపిన తండ్రి
- పోలీసుల అదుపులో నిందితుడు
- హెబ్బటంలో దారుణం



మంచంపై విగతజీవులుగా తల్లి సమీర, కుమార్తె సలీమా

ఆదోని/హొళగుంద, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవితాంతం తోడు ఉంటానని నిఖా చేసుకున్న ఆ భర్తే కాలయముడయ్యాడు. మంచి జీవితానికి, భవిష్యత్‌కు మార్గదర్శకుడు అవుతాడనుకున్న తండ్రే బిడ్డ గొంతు నులిమి చంపేశాడు. ఓ వైపు గర్భిణిగా ఉన్న భార్య, మరో వైపు ముక్కుపచ్చలారని కన్నబిడ్డను కనికరం లేకుండా హతమార్చిన సంఘటన కర్నూలు జిల్లా హొళగుంద మండలంలోని హెబ్బటం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మిగనూరు మండలం బాపురం కబందహాల్ గ్రామానికి చెందిన పింజారి సక్రప్పతో హొళగుంద మండలం ఇంగళదహాల్ గ్రామానికి చెందిన మాబీ, మాబాష దంపతుల పెద్ద కుమార్తె సలీమా (21)ను ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో రూ.50వేలు నగదుతో పాటు తులం బంగారు కట్నకానుకుల కింద ఇచ్చారు. రెండేళ్ల పాటు బాపురం కంబదహాల్ గ్రామంలో జీవనం సాగించిన వారు జీవనోపాధి కోసం హొళగుంద మండలంలోని హెబ్బటం గ్రామానికి వలస వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. పెళ్లయిన ఏడాదిలోగా సలీమా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 40రోజుల వరకు ఉన్న ఆ శిశువు అనారోగ్య కారణాల వల్ల మృతి చెంది. మరి ఏడాదిలోనే మరో ఆడబిడ్డ సమీరా (3)కు జన్మనిచ్చింది. సలీమా ఆరు నెలల గర్భిణి. అయితే గత కొంత కాలంగా భార్యపై సక్రప్ప అనుమానం పెంచుకున్నాడు. దీంతో పాటు మళ్లీ ఆడబిడ్డకు జన్మనిస్తుందని, మగబిడ్డ పుట్టడేమో అంటూ భార్యతో నిత్యం గొడవ పడేవాడు. గురువారం కూడా భార్య సలీమాను అనుమానించి ఆడబిడ్డలకే జన్మిస్తున్నావని, నీకు





మగసంతానమే పుట్టదని హింసించాడు. ఈ క్రమంలో దంపతుల మధ్య వాదోపవాదాలతో పాటు తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కోపొద్రిక్తుడైన సక్రప్ప భార్య సలీమాపై తల వెనక భాగంలో కర్రతో కొట్టాడు. ఒక్కసారిగా సలీమా కుప్పకూలింది. ఇదంతా గమనిస్తున్న కూతురు మూడేళ్ల చిన్నారి సమీరా భయంతో 'డాడీ..డాడీ..' అంటూ ఏడ్చింది. భార్యను చంపిన అనంతరం మూలన భయంతో దాక్కున్న కుమార్తె వద్దకు వెళ్లిన సక్రప్ప బాలికను లాక్కొచ్చి అత్యంత కర్కషంగా గొంతు నులిమి హతమర్చాడు. తల్లి కూతురు ఇద్దరు కూడా మృతి చెందాక పోలీసు ఎదుట లొంగిపోయాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఆలూరు సీఐ వెంకట చలపతి, ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.

తల్లితో కలిసి అల్లుడే హత్య చేశాడు : మృతురాలి తల్లి

నా కూతురు, మనవరాలు సమీరను అల్లుడు, అతని తల్లి కలిసి చంపారని మృతురాలి తల్లి మాబీ ఆరోపించింది. ఒక్కరోజు క్రితం పుట్టినిల్లు నుండి హెబ్బటం గ్రామానికి ఆరు నెలల గర్భిణి అయిన కూతురిని, మనవరాలుని తీసుకొచ్చి దిగబెట్టానని ఇలా దూరం అవుతారని కలలో కూడా అనుకోలేదు అంటూ ఆమె రోదించిన తీరు కలచివేసింది. చిన్నారిని గొంతు నులిమి హత్య చేసేందుకు చేతులు ఎలా వచ్చాయంటూ విలపించింది. ఈ ఘటనను చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటిపర్యంతమయ్యారు.

యువకుడి బలవన్మరణం

- పెట్రోలుకు తల్లి డబ్బు ఇవ్వలేదని రైలు కిందపడి..



సాకరే ఆకాష్ (ఫైల్)

ఆలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదోనిలో జరిగింది. ఆదోని పట్టణంలోని కిల్చిన్ పేటకు చెందిన రాఘవేంద్ర కుమారుడు సాకరే ఆకాష్ (20) గురువారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆకాష్ ఆలూరు పట్టణంలోని ఐటీఐ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. జల్సాలకు అలవాటు పడిన ఆకాష్ బుధవారం రాత్రి పెట్రోలకు రూ.500 ఇవ్వాలని తల్లిని అడిగాడు. అయితే తల్లి డబ్బు ఇవ్వలేదు. దీంతో క్షణికావేశానికి గురైన ఆకాష్ ఈరోజు రాత్రి నా డెడ్ బాడీ రైల్వే పట్టాలపై ఉంటుందని తల్లికి చెప్పి బయటకు వెళ్లిపోయాడు. ఆదోని-ఐస్వి రైల్వే స్టేషన్ల మధ్య కి.మీ 496/16-18డౌన్ లైన్ ట్రాక్ మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ గోపాల్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు.

చెరువులో పడి బీహార్ వాసి..



మృతి చెందిన సొహైల్ అన్సారీ

ఓర్వకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమితం తండా సమీపంలోని కొమ్ముచెరువులో ప్రమాదవశాత్తు పడి బీహార్ రాష్ట్రం సివార్ జిల్లా బీరా బంకత్ గ్రామానికి చెందిన సొహైల్ అన్సారీ (20) గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. యువకుడు పవర్ ప్రాజెక్టులో హెల్పర్‌గా పని చేస్తూ చేతికి అంటిన గ్రీస్ మరకలు శుభ్రపరిచేందు కోసం కొమ్ము చెరువులో చేతులు కడుగుతుండగా.. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. మృతుని అన్న ఫిరోజ్ అన్సారీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

కోడుమూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి మజరా గ్రామానికి రామాపురానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన చాకలి సుంకన్న భార్య హైమావతి (40) పట్ల అత్త సుంకులమ్మ, మరిది వెంకటరాముడు శారీరకంగా, మానసికంగా హింసించారు. మందు తాగి చనిపో అంటూ వేధించారు. ఈనేపథ్యంలో హైమావతి జీవితంపై విరక్తి చెంది గత నెల 24న పురుగుమందు తాగింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. హైమావతి తల్లి చాకలి చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ..



మృతి చెందిన సోనీబాయి

కొలిమిగుండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్న విషాదకర సంఘటన కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె గ్రామం లో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన సుగాలి మంగే నాయక్ భార్య సుగాలి సోనీబాయి(45) అనారోగ్య కారణంగా ఈ అఘాయి త్యానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. సీఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొత్తపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతమైన వీరభద్ర దుర్గం సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు గురువారం సాయంత్రం కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపారు. వివరాలివీ.. మండలంలోని కృష్ణానదిలోని గరిగలదిన్నె వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ముసలిమడుగు అటవీశాఖ సెక్షన్ అధికారి కావేరి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 50 నుంచి 60ఏళ్లలోపు ఉండవచ్చని, క్రీం కలర్ ఫుల్‌షర్టు, బూడిదరంగు నిక్కర ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే చేతికి పూసల బ్యాండ్, నలుపురంగు దారం ఉన్నట్లు గుర్తించామన్నారు. చనిపోయిన వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసివుంటే కొత్తపల్లి ఎస్ఐ 9121101185కు సమాచారం అందించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



ప్రవీణ్ కుమార్ (ఫైల్)

డోన్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ప్రవీణ్ కుమార్ (35) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల సమీపంలోని బాలానగర్‌లో లారీ అన్‌లోడు పాయింటు వద్ద టీ తాగేందుకు రోడ్డు సైడు వెళ్తుండగా.. జీపు ఢీకొని మృతి చెందాడని బంధువులు తెలిపారు. మృతదేహాన్ని గురువారం ఎర్రగుంట్ల గ్రామానికి తీసుకువచ్చారు. లారీ డ్రైవర్ భౌతిక కాయానికి డోన్ లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. మండలంలో లారీ డ్రైవర్లు, క్లీనర్లు, లారీ యజమానులతో సేకరించిన డబ్బులు రూ.36 వేల ఆర్థిక సాయాన్ని మృతుని కుటుంబానికి అందజేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'అద్దె అడిగితే చంపేస్తామంటున్నారు..'

- న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం
- పోలీసులు కూడా పట్టించుకోలేదు
- నంద్యాలలో ఓ కుటుంబం సెల్ఫీ వీడియో కలకలం



సెల్ఫీ వీడియోలో నాగరాజు కుటుంబ సభ్యులు

నంద్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'షాపింగ్ కాంప్లెక్స్ అద్దె చెల్లించాలని అడిగితే రాఘవేంద్ర ప్రసాద్, అతడి కుమారులు వేధిస్తున్నారు. హత్య చేస్తామని బెదిరిస్తున్నారు. ఇక మాకు ఆత్మహత్యే శరణం..' అంటూ ఓ కుటుంబం తీసుకున్న వీడియో సెల్ఫీ గురువారం నంద్యాలలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు తొమ్మండ్రు నాగరాజు వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. ఎన్‌జీవోస్ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి నంద్యాలకు చెందిన రాఘవేంద్ర ప్రసాద్, అతడి ఇద్దరు కుమారులు కిరణ్‌కుమార్, అరుణ్‌కుమార్ అనే వ్యక్తులకు అద్దెకు ఇచ్చాడు. అయితే కొన్ని నెలలుగా అద్దె చెల్లించకుండా తనను వేధించేవారని బాధితుడు వాపోయాడు. చివరకు అద్దె అడిగితే చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని, కుటుంబ సభ్యులను పరుషపదజాలంతో దూషిస్తూ అవమానిస్తున్నారని వెల్లడించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కలకలం రేపింది. చివరకు దుకాణాలవద్దకు వచ్చి అద్దె అడిగితే కుటుంబాన్నంతా చంపేస్తామంటూ బెదిరించడమే కాకుండా రూ.10లక్షలు ఇస్తే దుకాణాలను ఖాళీచేసి వెళ్తామంటున్నారని నాగరాజు సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినా పోలీసుల నుంచి స్పందన లేకుండా పోయిందని విలపించారు. తమకు న్యాయం జరగకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తన భార్య, కుమారుడితో కలిసి సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. సెల్ఫీ వీడియో అనంతరం నాగరాజు కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా నాగరాజు కుటుంబాన్ని పోలీసులు రక్షించి న్యాయం చేయాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

'ఉపాధ్యాయుడి మరణానికి కారకులను శిక్షించాలి'



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఎస్.ఎజాస్ అహ్మద్‌పైన దాడి చేసి ఆయన మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో చైర్మన్ సెక్రటరీ జనరల్ ఎస్.గోకారి, జి.తిమ్మప్ప డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం నగరంలోని కలెక్టర్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనం తరం ఎజాస్ అహ్మద్ మరణం పట్ల ప్రగాఢ సంతాపం తెలియ జేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అంద జేశారు. వారు మాట్లాడుతూ ఈ ఘటనతో ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయుడి మృతి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బహిరంగంగా నిందితు లకు కఠిన శిక్ష విధించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులు క్రమశిక్షణ తప్పి, పాఠాలు బోధించే ఉపాధ్యాయునిపైనే దాడి చేసి మరణానికి కారణం కావడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ ధర్నాలో సభ్యులు మరియానందం నారాయణ, సేవాలాల్ నాయక్, నవీన్ పాటిల్, సురేష్ మూర్తి, ముర్తుజావలి, నిసార్, హేమంత్, ప్రసాద్, శివనాగిరెడ్డి, గోవింద్, శ్రీధర్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన వైద్యాధికారి



ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో

బనగానపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైప ఉన్నత పాఠశాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ గురువారం తనిఖీ చేశారు. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్యశాఖ పరిధిలోని కైప ఉన్నతపాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ ఆర్‌బీఎస్‌కె కార్డులు విద్యార్థుల ఎత్తు, బరువు, హెచ్‌బీ టెస్టులు చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కె కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు, పాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర కార్యదర్శి జే. లలితమ్మ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జే. లలితమ్మ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్మికులకు గౌరవ వేతనాలు పెంచాలన్నారు. అంగన్‌వాడీలకు సరుకులు ప్రతి నెల మూడో తేదీ లోపల చేర్చాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, చౌడేశ్వరి, సువర్ణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల ఫ్యాక్టరీలో ప్రమాదం

- ఒకరి పరిస్థితి విషమం
- మరో ముగ్గురు కార్మికులకు అస్వస్థత





చికిత్స పొందుతున్న భరుణ్ మాండల్, మరో కార్మికుడు

ఓర్వకల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ గ్రామ సమీపంలోని ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేటు లిమిటెడ్ (పుట్టగొడుగుల ఫ్యాక్టరీ)లో గురువారం వర్మికంపోస్టు డ్రైనేజీ వాటర్ పైపులైన్‌కు అడ్డంగా ఉన్న గడ్డిని తొలగించేందుకు వెళ్లిన పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికుడు భరుణ్ మండల్ ప్రమాదవ శాత్తు 10 అడుగుల మ్యాన్ హోల్‌లో పడిపో యాడు. హుశేనాపురం గ్రామానికి చెందిన కార్మికులు వేణుగోపాల్, హరీష్, వెంకటరమణ ఇది గమనించి. భరుణ్ మండల్‌ను బయటికి తీశారు. అయితే. పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురు కార్మికులు వాసనతో అస్వస్థతకు గురయ్యారు. వీరిని కర్నూలు కామినేని ఆసుప త్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

విజిబుల్ పోలీసింగ్‌లో 36 వాహనాలు సీజ్

నంద్యాల క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా చేపట్టిన విజిబుల్ పోలీసింగ్‌లో 36 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు గురువారం తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్‌లో మొత్తం 37 కేసులు నమోదు చేసి 36 వాహనాలు సీజ్ చేశామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 116 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎంవీఐ యాక్ట్‌కింద 910 కేసులు నమోదు చేసి రూ.5,08,395ల జరిమానా విధించినట్లు వెల్లడించారు. డోన్ సబ్ డివిజన్ పరిధిలో జూదం ఆడుతున్న వారిపై దాడిచేసి అయిదుగురిని అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.5720లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా స్థావరాలపై దాడులుచేసి 50లీటర్ల నాటుసారాతోపాటు 17 మద్యం అక్రమ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగిని ఖాతాలో రూ.లక్ష మాయం

ఎమ్మిగనూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సచివాలయంలో ఏయన్ఎంగా పనిచేస్తున్న రాజేశ్వరి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ లక్ష కొట్టేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. రాజేశ్వరికి పట్టణంలోని ఎస్‌బీఐలో ఖాతా ఉంది. ఇందులో రూ 2.90 లక్షలు నిలువ ఉంది. మరో బ్యాంకులో కూడా ఖాతా ఉంది. అందులో గోల్డ్‌లోన్ ఉంది. రెండు రోజుల క్రితం గోల్డ్‌లోన్ చెల్లించేందుకు ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాలోని డబ్బును డ్రా చేసుకోనేందుకు వెళ్లింది. అయితే ఖాతాలో రూ 1.90 లక్షలు మాత్రమే ఉన్నాయి. సైబర్ నేరగాళ్లు అకౌంట్‌ను హ్యాక్ చేసి రూ.లక్ష కాజేసినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు రాజేశ్వరి ఫిర్యాదు చేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జడ్పీ సీఈవో జి. నాసరరెడ్డి సూచించారు. రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి రెండురోజుల శిక్షణ గురువారం డీపీఆర్‌సీ భవనంలో ప్రారంభమైంది. ప్రతి మండలం నుంచి ఈఓఆర్‌డీ/పంచాయతీ కార్యదర్శి, ఎంపీహెచ్‌ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హాజరయ్యారు. సీఈవో మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కోసం 9 థీమ్స్‌పై శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణలో జిల్లా శిక్షణ పరిశీలకులు వెంకటరత్నం, శిక్షణ మేనేజర్ గిడ్డేష్, డీపీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అభినందన



టీడీపీ కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన కార్యకర్తలను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అభినందించారు. గురువారం తన స్వగృహంలో టీడీపీ అభ్యున్నతికి అంకిత భావంతో పనిచేసిన వారికి ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియాలో క్రియాశీలంగా వ్యవహరించి వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, కల్లూరు మండల టీడీపీ కన్వీనర్ డి. రామాంజనేయులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు పెంచాలి



మేయర్‌కు సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికు లకు జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువా రం నగర పాలక కార్యాలయంలో మేయర్ బీవై.రామయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లా డుతూ పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకుని ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో రాష్ట్ర కోశాధికారి జే. రమేష్, జిల్లా అధ్యక్షుడు ఎస్.మనోహర్, నగర అధ్యక్షుడు జి. వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జావీద్, కాశపోగు జ్ఞానమ్మ పాల్గొన్నారు.

జగన్‌కు ఈరోజు రోశయ్య గుర్తొచ్చారా?

కర్నూలు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోశయ్య బతికుండగా.. గౌరవించని వైఎస్ జగన్ ఈరోజు రోశయ్యకు నివాళుల ర్పించడం విడ్డూరంగా ఉందని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కొత్తూరు సత్యనారాయణ గుప్తా విమర్శించారు. గురువారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ నాయకులకు పదవి కాంక్ష ఉండడం సహజమే కానీ ఒకరిని తొక్కి పైకి రావాలి అనుకోవడం భ్రమ అవుతుందని అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రోశయ్య పట్ల ఎంతో అభిమానంతో ఉండేవారనీ, కానీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోశయ్యపై వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రజలు గుర్తించుకున్నారన్నారు. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం రోశయ్య ముఖ్యమంత్రి పదవి ఇస్తే జీర్ణించుకోలేక జగన్ వ్యవహరించిన తీరు అందరికీ తెలుసునన్నారు.

రాయచోటి ఘటనలో నిందితులను శిక్షించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఏజెస్ అహ్మద్‌పై దాడి చేసి ఆయన మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజి వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం డీటీఎఫ్ కార్యాలయంలో ఉపా ధ్యాయుడు ఏజస్ అహ్మద్ మరణంపై ప్రగాఢ సంతాపం తెలి యజేశా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠాలు బోధించే ఉపాధ్యాయు డిపైనే దాడి చేసి మరణానికి కారణం కావడం దుర్మార్గమన్నారు.

ఉపాధ్యాయుడి మరణం బాధాకరం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచోటి లోని కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎస్.ఏజాస్ అహ్మద్ విద్యార్థుల దాడిలో మృతి చెందడం బాధాకరమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్వీ కృష్ణారెడ్డి, ఎం.ధనుంజ యుడు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ రాయచోటిలో ఉపాధ్యాయుడు పైన దాడి చేసి ఆయన మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, బాబురావు, బుగ్గన్న, శ్రీను, మల్లికార్జున పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలి



రామఫక్కీరప్పను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని చిన్నటేకూరు బీఆర్ అంబే డ్కర్ ఐఐటీ, మెడికల్ అకాడమీ పూర్వ విద్యార్థి డాక్టర్ రామ్ ఫక్కీరప్ప అన్నారు. గురువారం చిన్నటేకూరు బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో విద్యా ర్థుల తాగునీటి అవసరాల కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు రూ.లక్ష విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులు ఏబీసీడీ లక్ష్యం ఎంచుకోవాలని, ఏ అంటే ఏయిమ్, బీ అంటే బిహేవియర్, సీ అంటే క్యారెక్టర్ (స్వభావం), డి అంటే డిసిప్లేన్ అని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం కళాశాల డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, వైస్ ప్రిన్సిపాల్ ప్రత్యూష, అధ్యాపకులు శోభ, చంద్రశేఖర్ రామఫక్కీరప్పను శాలువతో సత్కరించారు.

క్రీడాకారులకు అభినందన



ప్రశంసాపత్రాలు అందుకున్న క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంకల్‌బాగ్‌లోని చిన్మయ మిషన్ విద్యాలయానికి చెందిన విద్యార్థులు కరాటేలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో జరిగిన అభి నందన కార్యక్రమానికి గ్యాస్ట్రో ఎంట్రాలజీస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అండర్-19, 17, 14 విభాగాల్లో మొత్తం 16 మంది క్రీడాకారులు జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సి పాల్ స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌శర్మ క్రీడాకా రులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం కరాటేలో తీర్చిదిద్దిన కోచ్ ఆరీఫ్, జగదీష్‌లను అభినందించారు. అనంతరం డాక్టర్ శంకర్ శర్మను శాలువతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సన్మానించారు.

మత్స్యకారులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే



సుంకేసుల డ్యాంలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను ప్రభు త్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్త గిరి అన్నారు. కర్నూలు మండలం సుంకేసుల డ్యాంలో గురువారం మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామలతో కలిసి కోడుమూరు ఎమ్మెల్యే 4.16 లక్షల చేపపిల్లలను నీటిలోకి వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలలకే మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.535 కోట్లు బడ్జెట్ కేటాయించిం దన్నారు. డీడీ శ్యామల మాట్లాడుతు మత్స్యకారులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘునాథ్, వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, గూడురు మత్స్యకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా బోర్డు డైరెక్టర్ శేఖర్, మత్స్యకారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: గ్రామాల అభివృద్ధే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు అర్బన్ మండలం మునగాలపాడు గ్రామంలో గురువారం సీసీరోడ్లు, డ్రైనేజీ మరమ్మతు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వైసీపీ అధికారంలో ఉన్నపుడు గ్రామీణ రహదారులు గురించి పట్టిం చుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మునగాలపాడు టీడీపీ నాయకులు సుంకన్న, అయ్యన్న, వెంకటేష్, మున్సిపల్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు: ఎస్పీ



బారికేడ్లను ప్రారంభిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియం త్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ తెలిపారు. చందన బ్రదర్స్, రామ్‌రాజ్, విజయమిల్క్ డెయిరీ, డ్రస్ సర్కిల్, మహా సిమెంట్ పలు వ్యాపారసంస్థలు అందించిన సహకారంతో 5 సోలార్ సిస్టం డిజిటల్ బారికేడ్లను, 10 ఐరన్ బారికేడ్లను, 50 నో పార్కింగ్ బోర్డులను, 2 ఆంప్లీఫైర్‌లను బుధవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పలు వ్యాపార సంస్థల సహకారంతో పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు 5 సోలార్ సిస్టం, డిజిటల్ బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. ట్రాఫిక్ రూల్స్, సోలార్ బారికేడ్లు, డిజిటల్ బోర్డుల ద్వారా తెలియజేస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ సూచనలు తెలిపే మైక్ అనౌ న్స్‌మెంట్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరణకు, ఓపెన్ డ్రింకింగ్ జరిగే ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలను నివారించేందుకు డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నామన్నారు. ఎక్క డైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే డయల్ 112, 100కు గానీ సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జే.బాబుప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, సీఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ట్రైనీ కలెక్టర్ కళ్యాణి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కళ్యాణి

కర్నూలు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని జిల్లా ట్రైనీ కలెక్టర్ కళ్యాణి అన్నారు. స్థానిక కర్నూలు ఆర్డీవో కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్, సర్పంచులు, ఎంపీటీసీలతో రెవెన్యూ సదస్సులపై ఆమె సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు రెవెన్యూ సదస్సుల్లో సమస్యలను తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా ఓర్వకల్లు మండలం తిప్పాయిపల్లె సర్పంచు మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు అధికంగా ఉన్నా యని, ఏ రెవెన్యూ అధికారికి చెప్పిన పరిష్కారం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో ట్రైనీ కలెక్టర్, సర్పంచు మధ్య వాదోప వాదాలు జరిగాయి. వెంటనే కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్‌కుమార్ జోక్యం చేసుకొని గొడవలు పడితే భూసమస్యలు పరిష్కారం కావని, సమస్య ఉంటే శాంతియుతంగా చెబితే తప్పకుండా పరిష్కారం చూపుతా మని అనానరు. 2014లో కర్నూలు రూరల్ మండలం బి. తాండ్రపాడులో 277 సర్వే నెంబరులో దాదాపు 1300 మంది పేదలకు ఇంటి స్థల పట్టాలు ఇచ్చారని, ప్రభుత్వాలు మారిన ఇప్పటి వరకు సర్వే చేసి స్థలాలు చూప డం లేదని ట్రైనీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కోడుమూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. గురువారం అయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన ప్యాలకుర్తి, 10న గోరంట్ల, 11న లద్దగిరి, 12న కోడుమూరు, 13న పులకుర్తి, 17న ముడుమలగుర్తి, 18న అమడగుంట్ల, 19న అనుగొండ, 20న వర్కూరు 21న ఎర్రదొడ్డిలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

సి.బెళగల్: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన సి.బెళగల్, 10న బ్రాహ్మణదొడ్డి, 11న కొత్తకోట, 12న కొండాపురం, 13 న గుండ్రేవుల, 17న పలుకుదొడ్డి, 18న మాలేసోమాపురం, 19న కంబంద హాల్, 20న బురాన్‌దొడ్డి, 21 పోలకల్లులో రెవెన్యూ సదస్సులు జరుగు తాయన్నారు.

కర్నూలు రూరల్: కర్నూలు రూరల్ మండలం దేవమాడ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ తెలిపారు. దేవమాడకు సంబంధించిన సదస్సు గొందిపర్ల-2 సచివాలయంలో జరుగుతుందన్నారు. ఈసదస్సుకు తహసీల్దార్ టి.వెం కట రమేష్‌బాబు హాజరవుతారన్నారు. భూసమస్యలు ఉంటే సదస్సు దృష్టికి తీసుకురావలని డీటీ గ్రామస్థులకు సూచించారు.

నేల తల్లిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న చీఫ్ మేనేజర్ చరణ్

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేలతల్లిని కాపాడుకునేందుకు రైతులు రసాయనిక ఎరువులను వినియోగించ రాదని, సేంద్రీయ ఎరువులను వాడాలని జూహరి ఫామ్‌హబ్ చీఫ్ మేనేజర్ చరణ్ విజ్ఞప్తి చేశారు. గురువారం కర్నూలు మండలంలోని పసుపుల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రాంగణంలో ప్రపంచ మట్టి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ చరణ్ మాట్లాడుతూ రైతులు రసానియక ఎరువులు, క్రిమిసంహారక మందులు పరిమితికి మించి వాడడం వల్ల పొలాలు నిస్సారమైపో తున్నాయని, పంట దిగుబడులు భారీగా తగ్గిపోతున్నా యని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఆర్గానిక్ అధికారి అశోక్ కుమార్ రెడ్డి, సంఘం సీఈవో మురళీధర్ చౌదరి పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా పారదర్శకంగా రూపొందించండి



డీపీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల సీనియారిటీ జాబితాను పారదర్శకంగా రూపొందించాలని నవీన పంచాయతీ కార్యదర్శుల సంఘం కోరారు. గురువారం కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌ను కలిసి వినతి పత్రం సమర్పిం చారు. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ (సీపీటీ) ఉత్తీర్ణతను ప్రామా ణికంగా తీసుకుని సీనియారిటీ జాబితా తయారు చేయాలని కోరారు. సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి గిరి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు మనోహర్, నరేష్, శివ, శంకర్ సింగ్ ఉన్నారు.

రాజ్యాంగ ఫలాలు దళితులకు అందాలి

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు



మాట్లాడుతున్న సుబ్బారావు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఫలాలు దళితులకు అందాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరపది సుబ్బారావు అన్నారు. గురువారం సీఆర్ భవన్‌లో కార్యదర్శి సి.మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్ల నుంచి ఎన్ఎస్ఎఫ్‌డీసీ స్కీమ్‌కు సంబంధించి ఎలాంటి నిధులు విడుదల చేయలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిందే కానీ ఎలాంటి ఖర్చు చేయలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రవే శపెట్టే బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమా వేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, భీమలింగప్ప, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుదాస్, కోటమ్మ, శైలజ, కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా స్టాంటన్ దొర జయంతి వారోత్సవాలు



మొక్క నాటుతున్న అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ విలియం ఆర్థర్ స్టాంటన్ దొర జయంతి వారోత్సవాలను నగరంలో జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం కొండారెడ్డి బురజు ఆవర ణలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా పూల మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాంటన్ దొర నగరంలో పలు సేవా కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు జి.రవికుమార్, ప్రసా దరావు, ప్రవీణ్‌కుమార్, పుష్పరాజ్, మాదవరాజు, కాంతమ్మ పాల్గొన్నారు.

స్టాంటన్ సేవలు చిరస్మరణీయం



స్టాంటన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అబ్రహం లింకన్ తదితరులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అమెరికా బాప్టిస్టు మిషనరీ నిర్వాహకుడు డాక్టర్ రెవ. డబ్లుఏ స్టాంటన్ దొర సేవలు చిరస్మరణీ యమని కోల్స్ చర్చి అధ్యక్షుడు ఏడీఏ అబ్రహం లింకన్ కొనియాడారు. గురువారం నగరంలోని ఈసీఎం బాలికల ఉన్నత పాఠశాలలో స్టాంటన్ 157వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ అబ్రహాం లింకన్‌తోపాటూ కోల్స్ చర్చి పాస్టర్ రెవ. జీవన్, రెడ్డిపోగు సుస్మిత హాజరై స్టాంటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భం గా కోల్స్ ఫౌండేషన్ వారు విద్యార్థులకు పరీక్షల అట్టలు, జామెట్రీ బాక్సులు, పెన్నులు అందజేశారు. కోల్స్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్ష, కార్య దర్శులు పి.విజయ్‌కుమార్, రమేష్ పాయ్, పాస్టర్ రవికుమార్, రెవ.పాల్ అగస్టీన్, ముత్యాల భాస్కర్, హెచ్ఎం ఆర్పీ రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు, విభిన్న ప్రతిభావంతులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీ చిత్రపటానికి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, విభిన్న ప్రతిభావంతులు సంయుక్తంగా క్షీరాభిషేకం చేశారు. గురువారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్క రించుకొని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదాసి ఎల్లప్ప ఆధ్వర్యంలో నగరంలోని టీడీపీ కార్యాల యం ఎదుట జరిగిన కార్యక్ర మానికి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు విభిన్న ప్రతిభావంతులకు ఇస్తున్న పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలు పెంచారన్నారు. మాదాసి ఎల్లప్ప మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విభిన్న ప్రతిభావంతులకు ఏటా 1750 అత్యా దునిక మోటార్ బైక్‌లు అందిస్తామని ప్రకటించడం హర్షణీ యమని అన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మద్ది లేటి, ప్రధాన కార్యదర్శి మక్బుల్ బాషా, ఉపాధ్యక్షురాలు మద్దమ్మ, కార్య నిర్వాహక కార్యదర్శులు సునేష్, రాజన్న, పాణ్యం, కర్నూలు నియోజక వర్గాల అధ్యక్షుడు వెంకటే శ్వర్లు, ఉపాధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరం లోని తుంగ భద్ర, హంద్రీ నదులపై నిర్మించే చెక్‌డ్యామ్‌లకు సం బంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర పాలక ఎస్ఈ రాజశేఖర్, నీటి పారుదల శాఖ ఎస్ఈకి లేఖ రాశారు. నగరంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకో టనున్నట్లు ఆయన పేర్కొ న్నారు. నగరంలోని తుంగభద్ర నది తీరాన రాఘవేంద్ర మఠం నుంచి అవతలి వైపునకు ఇరువైపు లా బండ్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. చెక్‌డ్యామ్‌లో కనీసం 0.50 టీఎంసీల నీటి సామర్థ్యం నిల్వ చేసుకోవచ్చన్నారు.

అనుమతి లేకుండా ఇసుక డంపు చేస్తే చర్యలు

సి.బెళగల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుక డంపు చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి హెచ్చరిం చారు. మండలంలోని తిమ్మనదొడ్డి తుంగ భద్రనది పక్కన గురువారం గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు 50 ట్రాక్టర్ల ఇసుకను డంపు చేసి విక్ర యానికి సిద్ధం చేసినట్లు గ్రామ స్థులు రెవెన్యూ అధికారులకు తెలిపారు. రెవెన్యూ అధికారులు విషయాన్నితహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అను మతి లేకుండా ఇసుకను డంపు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తే వాహ నాలను సీజ్, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చ రించారు. రెవెన్యూ అధికారుల రిపోర్టు మేరకు ఎస్ఐ తిమ్మారెడ్డి ఇసుక డంపును పంచనామ చేసి కేసు నమోదు చేశారు.

కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలి

ఓర్వకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ గ్రామ సమీపాన పుట్టగొడుగుల పరిశ్రమలో పనిచేస్తూ అస్వస్థత కు గురైన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, ఒక్కొక్క కార్మికునికి రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు, హుశేనాపురం గ్రామానికి చెందిన ముగ్గురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారన్నారు. వీరు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ సేవలు మరువలేనివి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ నారాయణ సేవలు మరువలేనివని జిల్లా కురువ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుడిసె శివన్న, ఎంకే రంగ స్వామి, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ అన్నారు. విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ నారాయణ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడన్నారు. ఈయన మృతికి వారు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కేసీ నాగ న్న, ఉపాధ్యక్షులు ధనుంజయ, బి.వెంకటేశ్వర్లు, బీసీ తిరుపాలు బాబు పాల్గొన్నారు.

ఘనంగా హంద్రీ నది దినోత్సవం



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా మేధావుల కన్సార్టియం సంస్థ ఆధ్వర్యంలో హంద్రీనది దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం నగరంలో మద్దూరు నగర్ లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో 'హంద్రీనది పరిరక్షణ -ఆవశ్యకత- తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర, మానవశక్తి పరిశోధన కేంద్రం అధ్యక్షుడు ఆచార్య మన్సూర్ రెహమాన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ హంద్రీనది పరిర క్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు. ఈ సమావేశంలో క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, వైద్య శాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ జయచం ద్రారెడ్డి, రవీం ద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, జిల్లా చాంబరాఫ్ కామర్స్ అధ్యక్షుడు విజ యకుమార్‌రెడ్డి, విశ్రాంత భూగర్భ శాఖ డీడీ ముచ్చుకోట చంద్రశేఖర్, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్ భాను, వ్యవసాయశాఖ విశ్రాంత డీడీ చిన్న నారాయణ, విశ్రాంత డీఎస్పీ పాపారావు, ఏపీఎస్పీ ఏసీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

42వ వార్డుకు త్వరలో ఎన్నికలు

నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని 42వ వార్డుకు త్వరలో ఎన్నికలు నిర్వహిం చనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు వార్డులో ఉన్న ఓటర్ల వివరాలు, వార్డు రిజర్వేషన్, పోలింగ్ కేంద్రాల వివరాలు ఇవ్వాలని కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఉన్న కార్పొరేటర్ ఓ కేసు విష యంలో జైలుశిక్ష పడింది. ఈ క్రమంలో అప్పటి నుంచి మళ్లీ ఎన్ని కలు జరగలేదు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ఖాళీగా ఉండే వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది.

నూతన కమిటీ ఎన్నిక

గూడూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణ వాల్మీకి సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుట్టపాశం రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా కుం చన్న గారి గిడ్డయ్య, ప్రధాన కార్యదర్శిగా కొండమీది కేశవులు, కార్యదర్శిగా మూలగేరి మండ్ల మద్దిలేటి, కోశాధికారిగా కె.విజ య్‌కుమార్, ఉప కార్యదర్శిగా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. అనంతరం గూడూరులోని వాల్మీకి ఆలయంలో నూతన కమిటీ సభ్యులు పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు.

హత్యకేసులో నిందితుల రిమాండ్

పత్తికొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలం రాంపల్లె గ్రామంలో హత్య కేసు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. నవంబరు 27న మహిళ హత్యకు గురైంది. నిందితులు రామానాయుడు, రామాంజినేయులు, లాలెప్పను గురువారం పోలీసులు అరెస్ట్‌చేసి పత్తికొండ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించడంతో వారిని సబ్‌జైలుకు తరలించినట్లు రూరల్ సీఐ పులిశేఖర్ తెలిపారు.

పట్టణంలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

ఆదోని టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్న మార్కెట్ ప్రాంతంలో ఆక్రమణలను గురువారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. కాలువను దాటి పుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన బంకులను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వీటిని తొలగిస్తున్నామని అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ సింగ్ తెలిపారు. తొలగింపులను కొనసాగిస్తామని, యజమానులే స్వయంగా తొలగించుకొని సహకరించాలని కోరారు. టీపీవో బాలమద్దయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని హత్య చేసిన వారిని శిక్షించాలి


పత్తికొండలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పత్తికొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం కొత్తపల్లి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఏజాష్ అహ్మద్‌ను హత్యచేసిన వారిపై తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల(ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నాలుగు స్థంబాల కూడలిలో నిరసన తెలిపారు. ఆ పాఠశాలలో మత్తు మందుల ప్రభావం ఉండడంతోనే ఈ దారుణానికి పాల్పడ్డారన్నారు. తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. సత్యనారాయణ, రామ్మోహన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, నాగభూషణం, గాజులబాస్కర్, బాస్కర్, సరస్వతమ్మ, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవైకి దరఖాస్తు చేసుకోండి

మద్దికెర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థలం ఉండి ఇళ్ల లేనివారు ప్రధానమంత్రి ఆవాజ్ యోజనకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ సూచించారు. గురువారం మాట్లాడుతూ కేంద్రం రూ.1.50లక్షలు, రాష్ట్రం రూ.లక్ష మొత్తం రూ.2.50లక్షలు అందుతుందన్నారు. గ్రామాల్లో నిర్మాణానికి రూ.1.80లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు

క్రైస్తవుల అభివృద్ధికి చేయూత


ఎమ్మెల్యేకు కేకు తినిపిస్తున్న పాస్టర్

పత్తికొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల అబివృద్ధికి చేయూత అందిస్తామని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్సీఎం చర్చిలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెవ. బిందెలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలు నిర్వహించారు. క్రైస్తవులకు ఇచ్చిన వాగ్దానాలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తారన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కటచ ఏశారు. నాయకులు సాంబశివారెడ్డి, తిరుపాల్, సుబాష్‌చంద్రబోస్, రాజు, ఆనంద్ తదితరులు పొల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ


పండ్లు, బ్రెడ్డు ఇస్తున్న సుధాకర్ గౌడ్

వెల్దుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు యువత అధ్యక్షుడు గుండ్రాతి సుధాకర్‌గౌడ్ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయంలో కేకు కట్ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

తుగ్గలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అల్లర్లు సృష్టించినా చర్యలు తప్పవని తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి హెచ్చరించారు. గురువారం తుగ్గలి, గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అక్రమ మద్యం, నాటు సారా తయారీ స్వచ్ఛందంగా ఆపివేయాలన్నారు. గొడవలకు పాల్పడి, క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటే కుటుంబాలు నాశనమవుతాయన్నారు. సమస్యలుంటే పెద్దల సమక్షంలో చర్చించి, పరిష్కరించుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ఆలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గోవింద్ సింగ్ గురువారం తెలిపారు. ఈనెల 6నుంచి జనవరి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. 6న మణేకుర్తి, 10న మొలగవల్లి, 11న హత్తిబెళగల్, 12న ఆలూరు, 13న అరికెర, 17న కురుకుంద, 18న హులేబీడు, 19న కరిడిగూడెం, 20న ముద్దనగేరి, 21న తుంబళబీడు, 26న కమ్మరచేడు, 27న మూసన హళ్లి, 28న కాత్రికి,31నా ఎగోసే హల్, జనవరి 2నా అంగస్కల్, 3నా మరకట్టు, 4నా కురువళ్లి, 7నా పెద్ద హొత్తూరు గ్రామాల్లో గ్రామ సభలు పూర్తి అవుతాయన్నారు. ఈ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.

విద్యాభివృద్ధికి పేరెంట్స్ మీటింగ్

తుగ్గలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేరెంట్స్ మీటింగ్‌తో విద్యాభివృద్ధి సాధ్యమని ఎంఈవో రామ వెంకటేశ్ గౌడ్ అన్నారు. గురువారం మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలన్నారు.

శిథిలావస్థ



స్థానిక పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. 30 ఏళ్ల క్రితం నిర్మించినది కావడంతో పెచ్చులూడుతున్నాయి. వర్షపు నీరు లోపలికి వస్తోంది. దీంతో వైద్య పరికాలు, ఔషధాలు నిల్వచేయడానికి ఇబ్బందిగా ఉందని నూతన వైద్యశాల నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు. **-మద్దికెర**

కంపతో అవస్థ



మండలంలోని ఆస్పరి నుంచి యాటకల్లు గ్రామానికి వెళ్లే రహదారి అంతా ముళ్ల కంపతో నిండి ఉంది. పలుసార్లు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిపైనే 8 గ్రామాలకు, ఎమ్మిగనూరుకు వెళ్లాలి. కంప తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **- ఆస్పరి**

దోపిడీకి ఒక్కటయ్యారు

- యథేచ్ఛగా ఎర్రమట్టి, ఇసుక తరలింపు
- ప్రతిపక్ష, అధికార పార్టీల నాయకుల కుమ్మక్కు


ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి తరలింపు


వేదవతి నదిలో తరలించేందుకు ఇసుక సిద్ధం

ఇంతకాలం అధికార పార్టీ నాయకులు దందా చేస్తే ప్రతిపక్ష నాయకులు అడ్డుకోవడాన్ని చూశాం. కానీ హాలహర్వి మండలంలో ఇరువురు ఒక్కటయ్యారు, అధికారులు ఇందుకు వంతపాడారు.. ఇంకేముంది పగలు మట్టి, రాత్రిళ్లు ఇసుకను దోచేస్తున్నారు.

హాలహర్వి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి, ఇసుక మాఫియా అందినకాడికి దోచేస్తున్నారు. ప్రతిపక్ష, అధికార పార్టీ నాయకులు కలిసి దోచేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి, వేదవతి నదిలోని ఇసుకను సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇసుక మాఫియా

జె.హోసళ్లి, గూళ్యం సమీపంలో వేదవతి నది ప్రవహిస్తోంది. ఈ నదిలో ఇసుక పుష్కలంగా దొరుకుతుంది. ప్రభుత్వం ఇసుక ఉచితం అని చెప్పినా ఇక్కడ అమలు కావడం లేదు. ట్రాక్టర్ ఇసుక రూ.4వేలకు అమ్ముకుంటున్నారు. అంతేకాదు రాత్రిళ్లు దాదాపు 20 ట్రాక్టర్ల ఇసుకను మన రాష్ట్ర సరిహద్దులు దాటించి, కర్నాటకకు తరలిస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఈ వ్యవహారం సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం.

మట్టి మాఫియా ఇలా

జె హోసళ్లి గ్రామ పరిధిలో ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి ఉంది. దీనిపై మాఫియా కన్ను పడింది. ఎలాంటి అను మతులు లేకుండా రెండు ఎక్స్‌కవేటర్లు, 20 ట్రాక్టర్లతో మట్టిని కర్నాటకకు తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవరిస్తున్నారు ఇందతా అధికార పార్టీ నాయకులు కనుసన్నల్లోనే సాగుతోందని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరచి ఈ మాఫియాను ఆపాల్సి ఉంది.

అనుమతి లేకుండా తరలిస్తున్నారు

మా గ్రామ పరిధిలోని ఇసుక, ఎర్రమట్టిని అనుమతి లేకుండా తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు దీన్ని ఆపాలి. **- ఉలిగమ్మ, సర్పంచ్, గూళ్యం**

అక్రమ రవాణాపై చర్యలు



రాత్రి పూట ఇసుక, పగలు ఎర్రమట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. పరిశీలించి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. **- నజ్మాబాను, తహసీల్దార్ హాలహర్వి**

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

వెల్దుర్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖరవర్మ అన్నారు. 6వతేదీన సూదేపల్లి, 7న గోవర్ధనగిరి, 10న లక్ష్మీనగరం, 11న వెల్దుర్తి, 12న బుక్కాపురం, 13న కలగొట్ల, 17న పుల్లగుమ్మి, 18న రామళ్లకోట, 19న ఎస్.బోయినపల్లి, 20న నరసాపురం, 21న సర్పరాజపురం, 24న మల్లెపల్లె, 26న నార్లాపురం, 27న చెరుకులపాడు, 28న ఎస్.పేరాముల, 31న బోగోలు గ్రామాల్లో ఉంటాయన్నారు. రైతులు అర్జీలు ఇచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే పడిపూజ

పత్తికొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో గురువారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పడిపూజలో పాల్గొన్నారు. మాలదారులకు అల్పాహారం ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలసి సహపంక్తిలో అల్పాహారం తీసుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులను ఆయనను సన్మానించారు. ఈ కార్యక్కరమంలో టీడీపీ నాయకులు సాంబ శివారెడ్డి, సురేష్‌కుమార్, క్రిష్ణ, శ్రీధర్‌రెడ్డి, నరసింహచౌదరి పాల్గొన్నారు.

సాంఘిక మురుగు కార్యాలయం


మురుగుతో నిండిన సహాయ సాంఘిక సంక్షేమ కార్యాలయం

పక్క చిత్రంలో కనిపిస్తున్నది మురుగు కాలువ కాదు.. ఆలూరు పట్టణంలోని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయం. ఇలా మురుగుతో నిండిపోయింది. దీంతో కార్యాలయాన్ని పత్తికొండకు తరలించారు. స్థానిక కోయనగర్ కాలనీ మురుగు నీరంతా కాలువల ద్వారా కార్యాలయం వద్దకు చేరడంతో ఈ దుస్థితి దాపురించింది. అధికారులు స్పందించి, శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- ఆలూరు**

చిన్నారులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం


చిన్నారులతో పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రూ.1.5లక్షల ఆర్థికసాయం అందించారు. చందోలికి చెందిన లక్ష్మీకి భర్త రంగప్ప చనిపోవడంతో తల్లివద్ద ఉండేది. కూతుళ్ల జయశ్రీ, ఉషశ్రీ, అంకిత పోషించుకు నేది. అయితే ఆమె కూడా ఇటీవలే గుండె పోటుతో మృతి చెందింది. దీతో చిన్నారులు అనాథల య్యారు. గురువారం పార్టీ కార్యాల యంలో చిన్నారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామపెద్ద సంజప్ప చేతులమీదుగా ఆర్థిక సాయాన్ని అందించారు. చిన్నారుల చదువు విషయంపై ఎన్టీఆర్ ట్రస్టుతో మాట్లాడతామని చిన్నారులకు అన్నివిదాల అండగా ఉంటామఇ హామీ ఇచ్చారు.

చూపును నిర్లక్ష్యం చేయొద్దు

కంటిచూపును నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే శ్యాంబాబు సూచించారు. గురువారం పత్తికొండ-2 సచివాలయంలో నంద్యాల శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో సువర్ణలత, ఈవో నరసింహులు, సిబ్బంది ఉన్నారు.

సభ్యత్వం ముమ్మరం చేయండి

దేవనకొండ: మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు, వాల్మీకి ఫెడరేషన్ ఛైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టీడీపీ నాయకులు వైకుంఠం శివప్రసాద్, జ్యోతి సూచించారు. గురువారం బస్టాండు నుంచి ర్యాలీ నిర్వహిం చారు. కన్వీనర్ విజయ్‌భాస్కర్ గౌడ్, రామ చంద్రనాయుడు, మల్లయ్య, వెంకటస్వామి గౌడ్, ఉచ్చీరప్ప, గుండ్లకొండ రాందాస్‌గౌడ్, చెన్నమనాయుడు, శాంతికుమార్ పాల్గొన్నారు

ప్రకృతిని కాపాడుకోవాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని కాపాడుకుంటే.. మనల్ని ప్రకృతి కాపాడుతుందని ఏవో వెంకట్రాముడు అన్నారు. గురువారం దేవనబండ రైతు సేవా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మట్టి పరీక్షల కార్డులను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలోఏఈవోలు రియాజ్‌బాషా, స్థానిక రైతు సేవా కేంద్రం సిబ్బంది వాణి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులను తగ్గించాలి

వెల్దుర్తి: వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, ఏవో అక్బర్‌బాషా రైతులకు సూచించారు. గురువారం పట్టణంలో ప్రపంచ నేల దినోత్సవంనిర్వహించారు. భూసార పరీక్షలు చేయించి, అందు తగట్టు ఎరువులు వాడి అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం అభూసార పరీక్ష ఫలితాల పత్రాలను రైతులకు అందజేశారు. విలసిత, అజయ్, రైతుసేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

ఆదోని టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పారిశ్య పనుల్లో నిర్లక్ష్యం ఉండరాదని మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆదేశించారు. గురువారం ఆయన పట్టణంలోని కొత్త బస్టాండు వద్ద పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డు సచివాలయ సిబ్బంది తమ ప్రాంతంలో ప్రతిరోజు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని సూచించారు.

సదస్సులను వినియోగించుకోండి

ఆదోని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని తహసీల్దార్ శివరాముడు పేర్కొన్నారు. గురువారం కార్యాలయంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు.

టీడీపీతోనే పంచాయతీల అభివృద్ధి .

తుగ్గలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయనీ ఆ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, సర్పంచ్ రంగమ్మ అన్నారు. గురువారం రామలింగాయపల్లెలో పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీలకు నిధులు రావడంతో ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో రామలింగాయపల్లె, చెన్నంపల్లి, కేపీ గుడిసెల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు.

బీమాను వినియోగించుకోండి

పంటల బీను రైతులు వినియోగించుకోవాలని ఏవో రవి సూచించారు. గురువారం మద్దికెర ఆర్బీకేలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బీమా చేసుకుంటే, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు నష్ట పరిహారం లభిస్తుందన్నారు. వివరాలను రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

టీడీపీ సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా

మద్దికెర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల బీమా వర్తిస్తుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పారా విఠోబ, పంచాయితీ సభ్యుడు జమేదార్ జంబునాథ రాయుడు అన్నారు. గురువారం సాయినగర్, రామ్‌నగర్ కాలనీలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు ఆధ్వర్యంలో చేయిస్తున్నామన్నారు. సాయి నగర్ బాషా, మాస్టర్ గిడ్డయ్య ఉన్నారు.

టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఆదోని టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ బాధితులకు సూపరింటెండెంట్ డా. వాణిశ్రీ టీబీ బాధితులకు పౌష్టిక ఆహార కిట్లను పంపిణీ చేశారు. ప్రైవేటు వైద్యులు డాక్టర్ మనీషా డాక్టర్ మనోజ్ కుమార్ వీటిని అందించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ కార్యక్రమం విజయవంతం కోసం ప్రతి ఒక్కరు తమ చేతనైనంత సాయం అందించాలని అన్నారు. రోగుల ఆరోగ్యం కుదుటపడేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ డా శేకున్న భాను, డా నాగరాజ్, ఎంపీహెచ్ఎస్ బాబురాజు, జిల్లా పీపీ యంకో ఆర్డినేటర్ ఉమాపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

పత్తికొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూసంబంధ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. గురువారం కార్యాలయంలో రాజకీయ పార్టీలు, రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. భూ సమస్యలు ఉంటే ఈ సదస్సులలో బాధితులు అర్జీలు ఇవ్వాలని సూచించారు. బాధితులు అర్జీలు ఇచ్చిన 15 రోజుల్లోపు అధికారులు పరిష్కరించాలని, లేదా సమాధానం ఇవ్వాలన్నారు. అధికారులు స్పందించకుంటే ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఆయా రాజకీయపార్టీల నాయకులు, అధికారులు, రైతులు ఉన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మండలంలో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. రైతులు, ప్రజలు భూ సమస్యలపై బాధితులు ఫిర్యాదులు ఇవ్వవచ్చని, తేదీల వారీగా గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. 6వ తేదీన హోసూరు, 10న జూటూరు, 12న పందికోన, 17న నలకదొడ్డి, 19న పత్తికొండ, 21న దూదేకొండ, 24న పెద్దహుల్తి, 27న పుచ్చకాయ లమడ, 31న చిన్నహుల్తి, జనవరి 2న దేవనబండ. 4వతేది చక్కరాళ్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

• మద్దికెర ఎస్ఐ విజయకుమార్ నాయక్



మద్దికెర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటామని మద్దికెర ఎస్ఐ విజయ కుమార్ నాయక్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: గ్రామాల్లో చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాము. అతిక్రమిస్తే కోర్టు విధించే శిక్షలను వివరిస్తున్నాం.

ప్రశ్న: శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు. ఆకతాయిలు, మందుబాబులు ఘర్షణ పడితే అదుపులోకి తీసుకుని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నాం. అవసరమైతే కేసులు నమోదు చేస్తున్నాము.

ప్రశ్న: బహిరంగ మద్యపానంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్ట విరుద్ధం. రాత్రిళ్లు సిబ్బంది గస్తీ తిరుగుతున్నారు.


ప్రశ్న: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారా?

జవాబు: సాయంత్రం 7 గంటల నుంచి డ్రైవ్ తనిఖీలు చేసి వాహనాలను సీజ్ చేస్తాం. కోర్టులో హాజరు పరిచి శిక్ష పడేలే చూస్తాం.

ప్రశ్న: పల్లె నిద్ర నిర్వహిస్తున్నారా?

జవాబు : ఎస్పీ ఆదేశాల మేరకు సూచించిన గ్రామంలో నిర్వహిస్తున్నాం.

మఠం అభివృద్ధికి సీఎం హామీ


చంద్రబాబును సన్మానిస్తున్న మంత్రాలయం పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారని మఠం ఏఏవో మాధవశెట్టి తెలిపారు. బుధవారం రాత్రి ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబును కలిశామని చెప్పారు. దాదాపు గంటసేపు మంత్రాలయంలో జరుగుతున్న అభివృద్ధి, అన్నదానం, గోశాల, విద్య, వైద్యం భక్తులకు అందుతున్న సేవలు, గదుల సౌకర్యం వంటి అంశాలపై చర్చించారని తెలిపారు. పెరుగుతున్న భక్తులను దృష్టిలో ఉంచుకొని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారని వెల్లడించారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం

ఎమ్మిగనూరు రూరల్/ పెద్దకడుబూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు జరిగే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి కోరారు. అలాగే పెద్దకడుబూరు మండలంలోని భూ సమస్యలు పరిష్కారం కోసం శుక్రవారం నుంచి 2025 జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు మండల తహసీల్దార్ శ్రీనాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు.

నందవరం: రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని నదికైరవాడిలో ఈ నెల 6న కనకవీడు గ్రామంలో 7న, 10న సోమలగూడూరు గ్రామంలో, 11న ముగతిలో, 12న హాలహర్విలో, 13న ధర్మాపురంలో, 17న నందవరం, 18న మాచాపురం, 10న ఇబ్రహీంపురం, 20న నాగలదిన్నె, 21 పూలచింత, 24న గంగవరం, 26న జోహరాపురం, 27న గురుజాల, 28న మిట్టసోమాపురం, 31న పెద్దకొత్తిలి గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని అన్నారు. వచ్చే నెల జనవరి 2న రాయచోటి, 3న పొణకలదిన్నె, 4న చిన్నకొత్తిలిలో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు, ఆర్ఐ జర్మీయా తెలిపారు.

చేనేతలకు ముడి సరుకులు అందిస్తాం


చేనేత కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

నందవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె గ్రామంలో ఇంటింటా సర్వే చేసి ముడి సరుకులు అందిస్తామని ఎమ్మిగనూరు ఏడీవో పెద్దయ్య, నందవరం ఏడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. చేనేతలతో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ముడి సరుకులు, చేనేత పరికరాలు అందజేస్తామన్నారు. చేనేతలు మండలంలోని నాగలదిన్నె, నందవరంతోపాటు కోడుమూరు ప్రాంతాల్లో అధికంగా ఉన్నారని, వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. ఇంటింటా సర్వే చేసి నిజమైన చేనేత కార్మికులను గుర్తించి మగ్గానికి, ముడి సరుకులకు ప్రత్యేకంగా పాసు పుస్తకం ఇస్తామన్నారు.

రాయచోటి ఘటనలో నిందితులను శిక్షించాలి


నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

మంత్రాలయం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో ఉపాధ్యాయుడు ఇజాద్ అహ్మద్ మృతి చెందడం దారుణమని, ఇందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు గోట్ల చంద్రశేఖర్, రామ్మోహన్, రామన్నలు డిమాండ్ చేశారు. గురువారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడు మృతికి సంతాపం తెలుపుతూ ఇలాంటి సంఘటన జరగడం సరికాదన్నారు. విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడిని హత్య చేయడం దారుణమన్నారు. ఇలాంటి వారిపై వెంటనే కఠినంగా శిక్షిస్తే మరోసారి ఇలాంటి సంఘటనలు జరగవని అన్నారు. సమావేశంలో ఉపాధ్యాయుడు నాగభూషణం, విజయకుమార్, శివశంకర్, సుభాషిణి, ఆశాలత, వీణాకుమారి, సువర్ణ, వాణి, గోపాల్ పాల్గొన్నారు.

ఎజాస్‌పై దాడి చేసి చంపడం దారుణం



మాట్లాడుతున్న ధనుంజయ్య

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు ఎజాస్‌ను దాడి చేసి చంపడం దారుణమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్య అన్నారు. గురువారం పీఆర్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువులపై విద్యార్థులు దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధ్యాయులపై విద్యార్థులు దాడి చేయడం సమాజానికి ఏ సందేశాన్ని అందిస్తున్నట్లో అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీనియర్ పీఆర్‌టీయూ నాయకులు మల్లికార్జున, రాజు, శంకరప్ప, నబి, నాగేంద్ర, భూషణం, జనార్ధన్, లక్ష్మన్న, వెంకన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకే రక్షణ లేకపోతే ఎలా?: ఎస్టీయూ

గోనెగండ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకే రక్షణ లేకపోతే ఇక దేశ భవిష్యత్తు ఏంటని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాయచోటిలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఏజాస్ అహమ్మద్‌ను విద్యార్థులు దాడి చేసి హత్య చేయడం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి సంఘటనలు ఇప్పటి వరకు ఎక్కడా జరగలేదని ఆయన తెలిపారు. అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థకు ఈ సంఘటన అద్దం పడుతుందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి నిందితులను రాజకీయాలకు అతీతంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైన ఉపాధ్యాయుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ సంఘం నాయకులు రాఘవేంద్రుడు, చంద్రశేఖర్, గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

పట్టని పర్యాటకం

● జీడీపీ వద్ద కనీస సౌకర్యాలు కరువు
● పర్యాటకులకు తప్పని ఇబ్బందులు

గోనెగండ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పర్యాకట రంగంగా పేరు ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టును పాలకులు విస్మరించారు. కర్నూలు జిల్లాలో ఏకైక నీటి పారుదల ప్రాజెక్టు గాజులదిన్నెను పట్టించుకోవడమే మానేశారు. పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామని గత పాలకులు మాట ఇచ్చి తప్పడంతో ప్రకృతి ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఉన్న ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు గాజులదిన్నె. ఇక్కడి పరిసరాల్లో కొబ్బరి, నీలగిరి, టేకు చెట్లు, తోటలు కనువిందు చేస్తున్నాయి. పర్యాటకుల సౌకర్యం కోసం అతిథి గృహం కూడా ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు ప్రాంతానికి ప్రతి రోజూ కర్నూలు, బెళగల్, గుడూరు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. సాయంత్రం వరకు ఇక్కడే కుటుంబ సభ్యులతో గడిపి వెళ్తుంటారు. ఇక పర్వదినాలలో ప్రాజెక్టు పర్యాటకులతో కిటకిటలాడుతుంది. అయితే సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కొళాయిలు, మరుగుదొడ్లు, కూర్చునేందుకు కుర్చీలు కూడా లేవు. ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చుతామని గత ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు హామీలు ఇవ్వడం వెళ్లి పోవడం పరిపాటిగా మారింది. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వంద రోజుల ప్లాన్ కింద రూ.3 కోట్లు కేటాయిస్తామని జీవోను కూడా విడుదల చేసింది. ఈ నిధులతో ఒక రెస్టారెంట్, ప్రాజెక్టు నీటిలో విహరించేందుకు బోట్లు, టాయిలెట్లు, పిల్లలు ఆడుకునే సామగ్రిని ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.


పర్యాటక రంగానికి గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్, కొత్తగా నిర్మించిన అతిథి గృహం, ప్రాజెక్టు చుట్టు పక్కల ఉన్న నీలగిరి చెట్లు


పర్వదినాలలో జీడీపీలో పర్యాటకుల సందడి

నిధులు కేటాయించాలి

గాజులదిన్నె పర్యాటక రంగానికి టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించాలి. ప్రత్యేక పర్యాటక రంగంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. దీంతో పర్యాటకులు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం అభివృద్ధి చేసే దిశగా ఆలోచించాలి.

- శ్రీనివాసులనాయుడు, గాజులదిన్నె

రమణీయం ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం

మంత్రాలయం, డిసెంబరు 5 ఆంధ్రజ్యోతి: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయల వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు తరలివచ్చి గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

● రాయచూరు జిల్లా అడిషనల్ ఎస్పీ హరీష్ కుటుంబ సమేతంగా గురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు మఠం జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, వ్యాసరాజా చార్, దేశాయి నరసింహ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు.


మహా కుంభాభిషేకం చేస్తున్న పీఠాధిపతి

● గద్వాల జిల్లా మల్దకల్లు గ్రామంలో వెలసిన ఆది శిలా క్షేత్రం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి మహా కుంభాభిషేకాన్ని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు వైభవంగా నిర్వహించారు. గురువారం ఆది శిలా క్షేత్రమైన మల్దకల్లు తిమ్మప్ప దేవస్థానం అధికారులు పీఠాధిపతికి ఘనంగా స్వాగతం పలికారు. ధ్వజ స్తంభం, మహా పంచామృతాభిషేకం, లక్ష్మీపూజ, క్షీరాభిషేకం పూజలు చేసి రాజగోపురం ఆవిష్కరించారు.

మధ్వమార్గ్ కారిడార్ పొడిగింపు



కొనసాగుతున్న మధ్వమార్గ్ కారిడార్ నిర్మాణ పనులు

మంత్రాలయం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం మధ్వమార్గ్ కారిడార్ పొడిగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎన్టీఆర్ క్యాంటీన్ నుంచి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఆధ్యాత్మిక కేంద్రం వరకు గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల మీదుగా 560 అడుగుల పొడవు, 38 అడుగుల వెడల్పుతో పనులు చేస్తున్నారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేష్ జోషీ, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరి, దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. జనవరిలో ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నట్లు శ్రీమఠం ఏఈ బద్రినాథ్ తెలిపారు.

నేడు గ్రామ సభలో పాల్గొననున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడికల్ గ్రామంలో శుక్రవారం జరగనున్న గ్రామ సభలో ఎమ్మెల్యే బీవి జయనాగేశ్వర రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని రైతులతో పాటు రెవెన్యూ శాఖ అధికారులు హాజరు కానున్నారు. రీ సర్వేలో సమస్యలు ఉన్న రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని రెవెన్యూ అధికారులు తెలిపారు.

బాలిక అదృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో ఓ బాలిక అదృశ్యమైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గురువారం స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానిక చెందిన ఓ బాలిక అదృశ్యం అయినట్లు రూరల్ పోలీస్ స్టేషన్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి


గుంతలుపడ్డ రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

పెద్దకడుబూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు పరమేష్, తిక్కన్నలు కోరారు. గురువారం పెద్దకడుబూరులోని కల్లుకుంటకు వెళ్లే రహదారిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలు కావస్తున్నా గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేయలేదన్నారు. గుంతలు పడిన రోడ్లతో ఎంతో మంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంతేగాక కొంతమంది ప్రాణాలు సైతం కోల్పోయారన్నారు. ఇప్పటికైనా గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈరన్న, రామన్న, రైతులు పాల్గొన్నారు.

చిలకలడోన తాగునీటి సమస్యకు పరిష్కారం

మంత్రాలయం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోనలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. రెండు రోజుల క్రితం సీపీఎం ఆధ్వర్యంలో నేషనల్ హైవే రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయించిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ షైనుద్దీన్ ఏఈఈ వెంకట్రాముడు గ్రామానికి తాగునీరు అందించేందుకు పనులు చేపట్టారు. మంత్రాలయం నుంచి వచ్చే పైపులైన్‌కు అనుసంధానం చేసి తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని వారు తెలిపారు.


తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. గురువారం సోమప్ప సర్కిల్‌లో నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో వివిధ భాగాలలో పని చేస్తున్న ఉద్యోగులు చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నారని అన్నారు. కనీస వేతనం, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, బాలాజి, పంపాపతి పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవడంలో విఫలం


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప అన్నారు. గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎమ్మిగనూరు పట్టణ కమిటీ సమావేశం స్థానిక సుందరయ్య భవన్‌లో పట్టణ కార్యదర్శి విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రంగప్ప మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు క్లాసులు నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని అన్నారు. కార్యక్రమంలో రవితేజ, ఉదయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ నదిని కమ్మేసిన ముళ్లపొదలు

తొలగించాలని గ్రామస్థులు, రైతుల వినతి


వేముగోడు, తిప్పనూరు దగ్గర ఉన్న హంద్రీలో పెరిగిన ముళ్ల పొదలు

గోనెగండ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముగోడు, తిప్పనూరు, లింగందిన్నె, హెచ్ కైరవాడి పుట్టపాశం గ్రామాల దగ్గర ఉన్న హంద్రీ నదిని ముళ్ల పొదలు కమ్మేశాయి. హంద్రీ నదిలోకి అడుగుపెట్టాలంటే ఇబ్బందిగా మారిందని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు వాపోతున్నారు. పెరిగిన ముళ్ల పొదల కారణంగా హంద్రీలోని భూగర్భ జలాలు సైతం అడుగంటే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. హంద్రీలోని నీటి పథకాల కోసం ఏర్పాటు చేసిన బోర్ల దగ్గరకు వెళ్లేందుకు వీలు లేకుండా పొదలు పెరిగిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో నీరు సమీపంలో ఉన్న పంట పొలాల్లోకి చేరి పంటలను నాశనం చేస్తున్నాయని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధిహామీ పథకం కింద ముళ్ల పొదలన తొలగించాలని కోరారు.

రోడ్డుపైనే చెత్తాచెదారం


నందవరంలో పేరుకుపోయిన చెత్త చెదారం

నందవరం, డిసెంబరు 5(ఆంధజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలో రోడ్డుపైనే చెత్తాచెదారం పారవేస్తున్నారు. దీంతో పరిసరాలు కంపు కొడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. నందవరం నుంచి మాచాపురం, పూలచింత, గంగవరం వెళ్లే రోడ్డు మధ్యలో చెత్త పడి నెలలు గడుస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ఆ దారి గుండా వెళ్లే ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

అట్టహాసంగా అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు ప్రారంభం



ఎమ్మిగనూరు, డిసెంబరు 5(ఆంధ్ర జ్యోతి): నీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు ఎమ్మిగనూరు పట్టణంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గురువారం స్థానిక వీవర్స్ కాలనీ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి దివంగత బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి ఎంతోమంది క్రికెట్ క్రీడాకారులు హాజరవుతున్నారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విన్నర్ జట్టుకు రూ.2 లక్షలు, రన్నర్ జట్టుకు రూ.లక్ష, ట్రోఫీలను అందజేస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో దాదాపు 130 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయని, ఫైనల్ పోటీలు జనవరి 15వ తేదీ ఉంటాయనని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు బోడబండ సురేష్‌చౌదరి, రంగస్వామిగౌడు, కలుగొట్ల నరసన్నగౌడు, భార్గవ్, భీమేష్, హరి, పార్లపల్లి మల్లికార్జున, టీడీపీ నాయకులు మాచాని శివశంకర్, మాచాని శివకుమార్, వీరేంద్ర, తురేగల్ నజీర్, శంకర్‌గౌడు, రాళ్లదొడ్డి మురళీకృష్ణారెడ్డి, బసరకోడు వెంకటేశ్వర్లు, సోగనూరు రాఘవేంద్ర పాల్గొన్నారు.

శ్రీమఠంలో డాక్టర్ గురురాజరావు

స్వాగతం పలికిన టీడీపీ నాయకులు


మంత్రాలయంలో డాక్టర్ గురురాజరావు, తిక్కారెడ్డి, రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబం వైద్యులు డా.గురురాజరావు గురువారం మంత్రాలయం వచ్చారు. ఈయనకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్, పూజారి వ్యాసరాజాచార్, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్‌లు ఘన స్వాగతం పలికారు. గురురాజరావు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మఠం పండితులు పట్టువస్త్రాలు, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. అనంతరం మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ ఇంటికి వెళ్లి టీడీపీ కార్యకర్తలతో కాసేపు మాట్లాడారు. అనంతరం ఇన్‌చార్జి గ్రామమైన మాధవరంలో రాఘవేంద్రరెడ్డితో కాసేపు మాట్లాడారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

గోనెగండ్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఎంఈవో నీలకంఠప్ప అన్నారు. గురువారం గోనెగండ్లలోని ఎంఆర్‌సీ భవనంలో ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

వరి గడ్డికి భలే గిరాకీ

ట్రాక్టర్ పశుగ్రాసం రూ.15 వేలు


కర్ణాటక నుంచి నందవరానికి ట్రాక్టర్‌లో తీసుకువస్తున్న వరి గడ్డి

నందవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరి గడ్డికి మండలంలో భలే గిరాకీ ఏర్పడింది. ఒక ట్రాక్టర్ వరి గడ్డి రూ.15 వేలు పలికింది. ఇక్కడ ప్రాంతంలో మిషన్ యంత్రాలతో వరిగడ్డిని కోస్తుండడంతో అది పశువులకు సరిపోదని కర్ణాటక ప్రాంతమైన శిరిగుప్ప తదితర ప్రాంతాల నుంచి వరి గడ్డిని ఇక్కడ రైతులు కొనుగోలు చేస్తున్నారు. వరి గడ్డి ఈ ప్రాంతంలో సరిగా దొరకకపోవడంతో రైతులు, పశువులు పెంచుకున్న వారు కర్ణాటక ప్రాంతంలోని రైతులను ఆశ్రయిస్తున్నారు. డబ్బులు ఎంతైనా పర్వాలేదంటూ అక్కడి రైతుల దగ్గర నుంచి ఏకంగా రూ.15,000 కొనుగోలు చేస్తున్నారు. కర్ణాటక వాసులకు వరి పంట పండించిన ఎకరాకు అన్ని డబ్బులు రావు. వరిగడ్డి అమ్ముకుంటేనే ఎంతో ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు.

వరిగడ్డి కొనలేక పశువులు అమ్ముకుంటున్నారు



వరిగడ్డిని కొనలేక పశువులు అమ్ముకుంటున్నాం. ఈ ప్రాంతంలో మిషన్ లతో వరిగడ్డి కోయడంతో అది పశువులకు మేతగా రావడం లేదు. దీంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి వరిగడ్డి కొని తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వం రైతుల కోసం సబ్సిడీ కింద వరి గడ్డిని అందించాలి.

- సుకూర్ రైతు